

పైసల్ మత్తు!

ఎక్సైజ్‌శాఖ మాయాజాలం


మద్యం దుకాణాల వద్ద అనధికార సిట్టింగ్ రూమ్‌లు!

జిల్లాలో ఎక్సైజ్ అధికారుల తీరు అనేక విమర్శలకు దారితీస్తోంది. మద్యం దుకాణాల వద్ద అనధికారికంగా సిట్టింగ్ రూమ్‌లు ఏర్పాటు చేసి మరీ నిర్వాహకులు మందుబాబులతో తాగిస్తున్నారు. ఉదయం పది గంటలకు తీయాల్సిన షాపులను ఏడు గంటలకే తెరిచేస్తున్నారు. తెలంగాణ నుంచి మద్యం తెచ్చి జోరుగా విక్రయాలు సాగిస్తున్నారు. ఫిర్యాదులపై తనిఖీలకు వెళ్లిన ఎక్సైజ్ అధికారులు పైసల్ 'మత్తు'లో అక్కడ తమకు ఏమీ కనిపించలేదన్నట్టు వెనక్కి తిరిగి వస్తున్నారు. ఎక్సైజ్ కార్యాలయాల్లో ఫైలు కదలాలంటే మాత్రం ప్రతి పనికి ఒకరేటు నిర్ణయించి మరీ ముక్కుపిండి వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

- ఉదయం 7 గంటల నుంచే విక్రయాలు
- తెలంగాణ మద్యం తెచ్చి జోరుగా అమ్మకాలు
- పట్టుకుని వదిలేసిన అధికారులు
- మధ్యవర్తిత్వం వహించిన ఇద్దరికి పెద్ద మొత్తంలో నగదు!
- కార్యాలయంలో ఫైలు కదలాలంటే నగదు చెల్లించాల్సిందే..



తెలంగాణ మద్యం బాటిల్



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం శివారులో ఉన్న సుల్తానగరం మద్యం దుకాణంలో తెలంగాణ నుంచి తెచ్చిన మద్యం విక్రయిస్తున్నారు. దీనిపై ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు అందింది. గత నెల 29వ తేదీన అధికారులు తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ మద్యం విక్రయి స్తున్నట్టుగా గుర్తించారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఇంతలోనే ఎస్ఎన్ గొల్లపాలెనికి చెందిన వ్యక్తి, ఒక ప్రజాప్రతినిధి వద్ద ఉండే మరో వ్యక్తి ఈ విషయంలో తలదూర్చారు. పెద్ద మొత్తంలో నగదు తీసుకుని ఈ అంశం పక్కదారి పట్టించేందుకు ఎక్సైజ్ అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చారని స్థానికులు చెప్పుకుంటున్నారు. దీంతో మద్యం దుకాణంలో లభించిన తెలంగాణ మద్యం, స్థానికంగా ఉన్న బెల్ట్‌షాప్‌లో దొరికినట్టుగా కథను మలిచేశారు. అధికారులు తీరుపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎక్సైజ్‌శాఖ జిల్లా అధికారులు ఈ విషయం మాకు తెలియదని చెబుతుండగా, మచిలీపట్నం ఎక్సైజ్ సీఐ మాత్రం బెల్ట్ షాపులోనే తెలంగాణకు మిగతా 6లో..

ఉదయం 7 గంటల నుంచే అమ్మకాలు

మద్యం దుకాణాల్లో ఉదయం 10 గంటలకు విక్రయాలు ప్రారంభించి రాత్రి 10 గంటలకు మూసివేయాలి. కానీ మద్యం దుకాణాలను ఉదయం ఏడు గంటలకే తెరుస్తున్నారు. దొడ్డిదారిన మద్యం విక్రయాలు జరిపేస్తున్నారు. అదేమని ఎవరైనా ప్రశ్నిస్తే లెక్కలు చూసుకునేందుకు షాపులు తెరిచామని చెప్పి తప్పించుకుంటున్నారు. గుడివాడలోని డిపో నుంచి మద్యం కేసులు తీసుకోవాలంటే ఒక్కో కేసుకు ఇంత అని అనధికారికంగా నగదు వసూలు చేస్తున్నట్టు సమాచారం. తాము సూచించిన వాహనాల్లోనే మద్యం దుకాణాలకు తరలించాలనే ఆంక్షలు కూడా పెడుతున్నట్టు తెలిసింది.

సిట్టింగ్ రూమ్‌లు ఏర్పాటు చేసి మరీ విక్రయాలు

జిల్లాలోని 115 మద్యం దుకాణాల్లో కేవలం మద్యం విక్రయాలు మాత్రమే జరపాలి. మద్యం దుకాణం వద్ద మందుబాబులు మద్యం తాగడానికి వీల్లేదు. అయితే మద్యం దుకాణాల వద్ద సిట్టింగ్ రూమ్‌లను ఏర్పాటు చేసి మరీ మందుబాబులతో అక్కడే మద్యం షాపుల వారు తాగిస్తున్నారు. మద్యం దుకాణం వద్ద సిట్టింగ్ రూమ్ ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలి. గతంలో సిట్టింగ్ రూమ్‌ల ఏర్పాటుకు ఒక్కో మద్యం దుకాణం నుంచి కనీసంగా రూ.2లక్షలను కట్టించుకునే వారు. ప్రభుత్వం సిట్టింగ్ రూమ్‌లకు ఇంతవరకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ఎక్సైజ్ శాఖ అధికారులే చెబుతున్నారు. అయినా అనధికారికంగా సిట్టింగ్ రూమ్‌లను ఏర్పాటు చేసి మరీ మద్యం విక్రయాలు జరపడం గమనార్హం. ఎక్సైజ్, పోలీస్‌శాఖల అధికారులు సిట్టింగ్ రూమ్‌లను ఏర్పాటు చేసినందుకుగాను మామూళ్లు దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.



ధన కార్యాలు!

వెస్ట్ బైపాస్‌లో అలైన్‌మెంట్ పేరుతో ఓ కాంట్రాక్టు ఉద్యోగి నిర్వాకం

- అధీకృతం కానీ అలైన్‌మెంట్ కాపీలతో పొలాల్లో హల్‌చల్
- టవర్ల మార్పు పేరుతో రైతుల నుంచి భారీగా వసూళ్లు!
- కార్లలో జల్సా.. పెట్రోల్ బంకు ఏర్పాటుకు స్థలాన్వేషణ
- సదరు ఉద్యోగి వ్యవహారశైలిపై సర్వత్రా విమర్శలు

జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్)లో పనిచేస్తున్న ఓ కాంట్రాక్టు ఉద్యోగి వ్యవహారశైలిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వెస్ట్ బైపాస్‌లో అలైన్‌మెంట్ పేరుతో సదరు ఉద్యోగి 'ధన'కార్యాలు వెలగబెట్టినట్టు ఆరోపణలు వస్తున్నాయి. అధీకృతం కానీ అలైన్‌మెంట్ కాపీలతో పొలాల్లోకి వెళ్లి హల్‌చల్ చేసి.. టవర్ల మార్పు, చేర్పుల పేరుతో రైతుల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడినట్టు సమాచారం. ఇతని అవినీతి పనులతో అలైన్‌మెంట్ వివాదాలమయంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వానికి తలనొప్పులను కలిగిస్తోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ వెస్ట్ బైపాస్ పేరుతో జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్)లో పనిచేస్తున్న ఓ కాంట్రాక్టు ఉద్యోగి చేపట్టిన 'ధన' కార్యాలు తాజాగా ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. సదరు ఉద్యోగి చేసిన పనుల వల్ల బైపాస్‌లో అనేక చిక్కుముడులు ఏర్పడ్డాయి. అలైన్‌మెంట్ వివాదాలతో గడువులోపు ప్రాజెక్టు పూర్తి కాకపోగా, రాష్ట్ర ప్రభుత్వానికే తలనొప్పులను కలిగిస్తోంది. విజయవాడ వెస్ట్ బైపాస్‌లో మొత్తం ఆరు అలైన్‌మెంట్ల విషయంలో కాంట్రాక్టు ఉద్యోగి అలైన్‌మెంట్‌లను ఇష్టానుసారం మార్పులు, చేర్పులు చేసినట్టుగా తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. ఈ మార్పుల కారణంగా ఎంతో మంది రైతులు నష్టపోగా.. కొంత మందికి మాత్రం జేబులు దండిగా నిండాయి. ఎన్‌హెచ్ అధికారులంతా సివిల్ పనులపై అవగాహన కలిగిన వారు. అలైన్‌మెంట్ వ్యవహారాలకు సంబంధించి వారికి పూర్తిగా పట్టు ఉండదు. దీనిని అదనుగా చేసుకుని ఆ కాంట్రాక్టు ఉద్యోగి విజయవాడ బైపాస్‌లో విశ్వరూపం చూపించాడని తెలుస్తోంది. అధీకృత మిగతా 6లో..



ఆకట్టుకున్న నృత్య రూపకం

గోదా కళ్యాణం నృత్య రూపకంలో కళాకారుల అభినయం 6లో

శాంతి భద్రతలకు ప్రాధాన్యత



ఉయ్యూరు రూరల్ పోలీస్ స్టేషన్ నూతన భవనం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర.. చిత్రంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ గంగాధరరావు

8లో

మెట్రోకు మంచి తరుణం

రుణం ఇచ్చేందుకు ప్రపంచ సంస్థల క్యూ

రూ.5,990 కోట్ల రుణానికి ఏఐఐబీ ఓకే

- తక్కువ వడ్డీ, షరతులు నామమాత్రమే
- ఏపీఎంఆర్‌సీ అధికారులతో ఏఐఐబీ భేటీ
- బందరురోడ్డు, ఏలూరు రోడ్డు కారిడార్ల పరిశీలన
- రుణం ఇవ్వటానికి మరిన్ని సంస్థల ఆసక్తి
- ఏఐఐబీవైపే మెట్రో అధికారుల మొగ్గు





విజయవాడలో ఏఐఐబీ ప్రతినిధులను సన్మానిస్తున్న ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ ఎండీ ఎన్‌పీ రామకృష్ణారెడ్డి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ మెట్రోరైల్ ప్రాజెక్టుకు ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) రూ.5,900 కోట్ల రుణం ఇచ్చేందుకు ముందుకొచ్చింది. విజయవాడ మెట్రోరైల్ ప్రాజెక్టుకు రుణాన్ని ఇవ్వటానికి జైకా, ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, ఎన్‌డీబీ, ఏఎఫ్‌డీ, కేఎఫ్‌డబ్ల్యూ వంటి సంస్థలు ఇప్పటికే ముందుకొచ్చాయి. వీటన్నింటిలో ఏఐఐబీ సంస్థ అతి తక్కువ వడ్డీకి ఇబ్బందికర షరతులు లేని రుణాలను ఇస్తామని పేర్కొంది. దీంతో ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు చైనా ప్రధాన కేంద్రం కలిగిన ఈ సంస్థకు ఆహ్వానం పలికారు. మంగళవారం చర్చలు కూడా జరిగాయి. ఏఐఐబీ ప్రతినిధులు సంతోష్, పాస్కల్ రసెల్.. ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డితో సమావేశమయ్యారు. విజయవాడ, విశాఖపట్నం మెట్రో ప్రాజెక్టుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆ సంస్థ ప్రతినిధులకు వివరించారు. విజయవాడ మెట్రో కారిడార్-1, 2 గురించి వివరించారు. సమావేశం అనంతరం ఏఐఐబీ ప్రతినిధులు మెట్రో కారిడార్ రోడ్లను పరిశీలించారు. రామకృష్ణారెడ్డి వారిని వెంట తీసుకెళ్లి చూపించారు. కారిడార్లను పరిశీలించిన అనంతరం మిగతా 6లో..


సీఎంపీ సర్వే పూర్తి

విజయవాడ మెట్రో ప్రాజెక్టు తొలిదశ పనులకు కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ) సర్వేకు ఆదేశించిన నేపథ్యంలో కన్సల్టెంట్‌ను నియమించి సర్వే పూర్తిచేశారు. ప్రస్తుతం సంస్థ ప్రతినిధులు ఢిల్లీలో రిపోర్టులు తయారు చేస్తున్నారు. అవి రాగానే, ఏపీఎంఆర్‌సీ అధికారులు కేంద్రానికి నివేదిక పంపిస్తారు.

మెట్రో కన్సల్టెంట్‌కు టెండర్లు


మెట్రో ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడానికి వీలుగా ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ అధికారులు కన్సల్టెంట్ నియామకానికి టెండర్లు పిలిచారు. టెండర్లలో ఖరారైన కన్సల్టెన్సీ సంస్థ ఈ ప్రాజెక్టు పనులను పర్యవేక్షిస్తుంది. గతంలో ఢిల్లీ మెట్రోరైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) ఛైర్మన్ శ్రీధరన్‌ను ప్రభుత్వ మెట్రో సలహాదారుగా నియమించారు. దీంతో ఆయనే కన్సల్టెంట్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం డీఎంఆర్‌సీ భాగస్వామ్యాన్ని తీసుకునే ఉద్దేశం ప్రభుత్వానికి లేకపోవటంతో కన్సల్టెన్సీని నియమించుకోవాలని ఏపీఎంఆర్‌సీ అధికారులు భావిస్తున్నారు.

లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ ఛైర్మన్‌గా బాలశౌరి



మచిలీపట్నం, మే14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ ఛైర్మన్‌గా మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ఐదోసారి ఎంపికయ్యారు. గతంలో నాలుగు సార్లు ఈ కమిటీ ఛైర్మన్‌గా పనిచేసిన ఆయన 38 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉన్నతాధికారులతో సమావేశాలు నిర్వహించి పరిపాలనాపరమైన అంశాలు, నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలను కేంద్ర ప్రభుత్వ పెద్దలకు తెలియజేసి సమస్యలను పరిష్కరించడంలో కృషి చేశారు. దీంతో ఆయనకు మళ్లీ ఈ పదవి దక్కింది. తనను లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ ఛైర్మన్‌గా నియమించడానికి సహకారం అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా. కూటమి పెద్దలకు వల్లభనేని కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా ఎంపీ తెలిపారు.

వృద్ధురాలి దారుణ హత్య



మేరీ మృతదేహం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలు దారుణ హత్యకు గురైన ఘటన బాపులపాడు మండలంలో బుధవారం సంచలనం రేపింది. వీరవల్లి పోలీసుల కథనం ప్రకారం.. సిరివాడ గ్రామానికి చెందిన మేరీ (60) ఊరికి దూరంగా ఉన్న ఇంట్లో ఒంటరిగా నివసిస్తుంది. బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో హత్యకు గురైంది. అటువైపుగా వెళ్లే వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గన్నవరం డీఎస్పీ శ్రీనివాసరావు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పదునైన ఆయుధంతో దాడి చేయడం వల్లే వృద్ధురాలు మృతి చెందినట్టు నిర్ధారించారు. ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హతురాలికి ఎవరూ లేరు. ఆమెను ఎవరు చంపారు, ఎందుకు చంపాల్సి వచ్చింది అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రాజకీయం రసవత్తరం



తిరువూరు మునిసిపాలిటీలో క్యాంప్ రాజకీయాలు

- 19న వైసీపీ ఛైర్మన్ ఎన్నిక నేపథ్యంలో రాజుకున్న వేడి
- పక్కచూపులు చూస్తున్న కొంతమంది కౌన్సిలర్లు
- ఛైర్మన్ పీఠం కాపాడుకునేందుకు వైసీపీ ప్రయత్నాలు
- ప్రత్యేక వాహనాల్లో పట్టణం దాటించిన స్థానిక నేతలు



తిరువూరు మునిసిపల్ కార్యాలయం

తిరువూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : తిరువూరు మునిసిపాలిటీలో క్యాంప్ రాజకీయాలు మొదలయ్యాయి. ఈనెల 19న పాలకవర్గ వైసీపీ నుంచి కొత్త ఛైర్మన్‌ను ఎన్నుకునే అవకాశం ఉండటంతో ఆ పార్టీ పెద్దలు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే కొందరు వైసీపీ కౌన్సిలర్లు పక్క చూపులు చూస్తుండటంతో స్థానిక నాయకులు, కౌన్సిలర్లు కలిసి వారిని బుధవారం పట్టణం దాటించారు. ప్రత్యేక వాహనంలో దూరప్రాంతానికి తరలించారు.

19న కొత్త ఛైర్మన్ ఎన్నిక నేపథ్యంలో..

తిరువూరు మునిసిపల్ వైసీపీ ఛైర్మన్ ఎన్నిక మొదటి నుంచి రాజకీయ వివాదాలకు దారితీసింది. ఈ కౌన్సిల్‌లో మొత్తం 20 మంది సభ్యులు ఉండగా, వారిలో 17 మంది వైసీపీ, ముగ్గురు టీడీపీ సభ్యులు. నాటకీయ పరిణామాల నేపథ్యంలో ప్రస్తుత ఛైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి ఏప్రిల్ 3న తన పదవికి మిగతా 6లో..

ఆది నుంచీ వివాదాలే..

వైసీపీ ఆధ్వర్యంలో పాలకవర్గం కొలువుదీరిన నాటి నుంచి ఆ పార్టీ కౌన్సిలర్ల మధ్య సఖ్యత కొరవడింది. ఆధిపత్య పోరు నేపథ్యంలో కౌన్సిల్ సమావేశాలే రద్దు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఛైర్‌పర్సన్ రెండేళ్ల తర్వాత రాజీనామా చేయాలనే నాటి ఎమ్మెల్యే రక్షణనిధి షరతు, ఆ తర్వాత పరిణామాల నేపథ్యంలో కొన్ని అభివృద్ధి పనులు కూడా నిలిచిపోయాయి.

మంగినపూడి బీచ్‌లో సిద్ధమవుతున్న గౌతమ బుద్ధుడు ప్రతిమ



అబ్బురం.. కళారూపం

మంగినపూడి బీచ్‌లో మసూలా బీచ్ ఫెస్ట్-2025కు చురుగ్గా ఏర్పాట్లు

(మచిలీపట్నం టౌన్ - ఆంధ్రజ్యోతి): మంగినపూడి బీచ్‌లో జూన్ మొదటి వారంలో జరగనున్న మసూలా బీచ్ ఫెస్ట్-2025కు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. సినీ ప్రొడక్షన్ డిజైనర్, ఆర్ట్ డైరెక్టర్ వంకా రమణ నేతృత్వంలో 150 మంది కళాకారులు, శిల్పులు అద్భుతమైన కళారూపాలను తీర్చిదిద్దుతున్నారు. బీచ్ మొదట్లో ఇనుప గ్రిల్స్‌తో గేట్ వే ఆఫ్ అమరావతిని ఏర్పాటు చేస్తున్నారు. 56 అడుగుల వెడల్పు గల ఈ గేట్ వే అమరావతిలో 81 అడుగల ఎత్తైన శిల్పాలను సిద్ధం చేస్తున్నారు. 11 అడుగుల గౌతమ బుద్ధుడు విగ్రహాన్ని థర్మాకోల్‌తో రూపొందిస్తున్నారు. పాండురంగ స్వామి విగ్రహం ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. పీతలు, చేపలు, డాల్ఫిన్‌లు, నత్తలు, గవ్వలు, ఆల్చిప్ప ఆకృతులను తయారు చేస్తున్నారు. ఈ గేట్ వే ఆఫ్ అమరావతిలో కలంకారీని త్రిడి వాల్స్‌లో ఉంచుతున్నారు. బందరు హల్వా, బందరు లడ్డూ, బందరు రోల్డుగోల్డు నగలు విశిష్టత తెలిసేలా తీర్చిదిద్దుతున్నారు. సముద్రపు గాలిని తట్టుకునే విధంగా శిల్పి నారాయణ కళాకృతులను రూపొందిస్తున్నారు.



కళాకారులు రూపొందిస్తున్న పాండురంగ స్వామి ఆకృతి



శంఖం



పీత



పరిమితికి మించి లోడుతో వెళుతున్న ప్రయివేటు ట్రావెల్స్ బస్సులు



ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు నిబంధనలకు విరుద్ధంగా సరుకు రవాణా చేస్తున్నాయి. ఓవర్‌లోడ్‌తో ప్రమాదకరస్థాయిలో పరుగులు తీస్తున్నాయి. ప్రయాణికులను చేరవేయాల్సిన బస్సులు క్వింటాళ్ల కొద్ది సరు

భద్రత ఎంత?

కును కూడా తలకెత్తుకుంటున్నాయి. దీంతో ప్రైవేటు బస్సుల్లో ప్రయాణం చేయాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. ఓవర్‌లోడ్ కారణంగా ప్రమాదాలు జరిగితే నష్టం అంతాఇంతా కాదు. రవాణా శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రైవేటు బస్సులు ఓవర్‌లోడ్‌తో రహదారులపై చక్కర్లు కొడుతున్నాయి. కొన్ని బస్సులు వాటి ఎత్తుకు మించి సరుకుతో ప్రయాణిస్తున్నాయి. రాత్రి వేళల్లో అధిక వేగంతో హైవేపై వెళుతున్న బస్సు పొరపాటున అదుపుతప్పితేనే మరణాలు సంభవిస్తాయి. ఇక ఓవర్‌లోడ్ బస్సులు పరిమితికి మించి వేగంతో వెళితే.. ఊహించడానికే భయమేస్తుంది.

నిలువెత్తు నిర్లక్ష్యం!

- గాల్లో దీపంలా ప్రయాణికుల భద్రత
- ఓవర్‌లోడ్‌తో ట్రావెల్స్ బస్సుల పరుగులు
- కాసుల కక్కుర్తితో క్వింటాళ్ల కొద్దీ సరుకు రవాణా
- ప్రమాదమని తెలిసినా యజమానుల నిర్లక్ష్యం
- చూసీ.. చూడనట్టుగా రవాణా అధికారులు

(విజయవాడ, ఆంధ్రజ్యోతి)

ప్రయివేటు ట్రావెల్స్ యజమానులు నిబంధనలు విస్మరించి తమ స్వార్థానికి ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెడుతున్నారు. సాధారణంగా ట్రావెల్స్ బస్సులకు ఎక్కడపడితే అక్కడ అపి (స్టేజి క్యారియింగ్) ప్రయాణికులను ఎక్కించుకోవడానికి అనుమతులు ఉండవు. కాంట్రాక్టు క్యారీయింగ్(ఒక దగ్గరే ఎక్కించుకోవాలి) పద్ధతిలో ప్రయాణికులను గమ్యస్థానానికి చేర్చాలి. కానీ నగరంలో అనేక చోట్ల ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. చాలా ప్రాంతాల్లో రహదారులకు అడ్డంగా ట్రావెల్స్ బస్సులు నిలపడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలం చెల్లిన బస్సులతో పాటు ఓవర్‌లోడ్‌తో బస్సులను నడుపుతూ ప్రయాణికుల భద్రతను ట్రావెల్స్ యాజమాన్యాలు పట్టించుకోకండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి.

నగరం నడిబొడ్డున జరుగుతున్నా అధికారులు అంటీముట్టనట్టు వ్యవహరిస్తుండడం గమనార్హం. అధికారుల చొరవతోనే ట్రావెల్స్ యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం ట్రావెల్స్ బస్సులు ఓవర్‌లోడ్‌ను తరలిస్తున్నా అధికారులకు కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

విజయవాడ కేంద్రంగా రోజూ సుమారు 500 బస్సులు వివిధ ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి ప్రయాణాలు చేసేవారే అధికం. ఉద్యోగం, ఇతరత్రా పనులు చేసుసకునే వారు సమయానికి ప్రైవేటు ట్రావెల్స్ అందుబాటులో ఉండటంతో అధికశాతం వాటిని ఆశ్రయిస్తుంటారు. విజయవాడ నుంచి ప్రధాన నగరాలైన చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నానికి నిత్యం ప్రయాణం చేస్తుంటారు. ప్రయాణికుల భద్రతపట్ల ట్రావెల్స్ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. టికెట్ల ధరల విషయంలో తగ్గని ట్రావెల్స్ నిబంధనలను సడలించడంలో మాత్రం ముందుంటున్నాయి. ట్రావెల్స్ ప్రయాణికుల లగేజీ (బ్యాగులు, ట్రాలీలు) మాత్రమే వారి వెంట అనుమతించాలి. కానీ కాసులకు కక్కుర్తిపడి క్వింటాళ్ల కొద్దీ లగేజీని తీసుకెళుతూ ప్రయాణికుల జీవితాలతో ఆడుకుంటున్నారు. హైవేపై రోజూ ఏదో ఒక ప్రమాదం జరుగుతూ ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఎన్నో కుటుంబాలు తల్లిదండ్రులు, పిల్లల్ని కోల్పోతున్నారు. డబ్బు చెల్లించి ప్రయాణిస్తున్నపుడు ప్రశ్నించే హక్కు ప్రయాణికులకు ఉంటుంది. ట్రావెల్స్ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించినా, దురుసుగా ప్రవర్తించినా వారు అధికారులను ఆశ్రయించవచ్చు.



కానుకల లెక్కింపులో ఈవో, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది

కనకదుర్గమ్మకు రూ.3.73కోట్ల కానుకలు

ఇంద్రకీలాద్రి, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం మల్లేశ్వర మహామండపం 6వ అంతస్తులో భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులను లెక్కించారు. 23 రోజులకు రూ.3,73,37,549లు నగదు రూపంలో రాగా, 420 గ్రాముల బంగారం, 7కేజీల20 గ్రాముల వెండి రూపంలో సమకూరాయి. ఈవో, డిప్యూటీ కలెక్టర్ వీకే శీనానాయక్ హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. దేవదాయశాఖ సిబ్బంది, వన్‌టౌన్ పోలీసులు, ఎస్పీఎఫ్ పోలీసులు కానుకల లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.



జల ప్రసాద కేంద్రం ప్రారంభిస్తున్న ఈవో శీనా నాయక్

దుర్గమ్మ భక్తులకు సురక్షిత తాగునీరు

- దివీస్ ల్యాబొరేటరీస్ వితరణ

ఇంద్రకీలాద్రి, మే 14 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వరుల దేవస్థానంలో భక్తులకు సురక్షిత తాగునీరు అందించేందుకు దివీస్ ల్యాబొరేటరీస్ సంస్థ ముందుకు వచ్చి జల ప్రసాద కేంద్రాలు ఏర్పాటు చేయటం హర్షణీయమని ఈవో వీకే శీనా నాయక్ పేర్కొన్నారు. బుధవారం ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డు, దుర్గాఘాట్‌లలో దివీస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సురక్షిత తాగునీటి (జల ప్రసాదం) కేంద్రాలను ఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాజిక సేవలో దైవత్వం ఇమిడి ఉందని, భక్తులకు చేసే సేవ భగవంతునికి చేసినట్టేనన్నారు. సామాజిక, కార్పొరేట్ సంస్థలు భక్తుల సేవలో పాలు పంచుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. అనంతరం భక్తులకు సురక్షిత నీరు అందించారు. కార్యక్రమంలో దివీస్ సంస్థ ప్రతినిధులు, ఆలయ ఈఈలు పాల్గొన్నారు.



కనకదుర్గమ్మ సేవలో శృంగేరి విరూపాక్ష మఠం పీఠాధిపతులు

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను బుధవారం అనంతపురం శృంగేరి విరూపాక్ష మఠం పీఠాధిపతులు శ్రీవిద్యా నృసింహ భారతీ మహాస్వామి దర్శించుకున్నారు. ఈవో శీనా నాయక్ పీఠాధిపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం అనంతరం వారికి ప్రసాదం, దుర్గమ్మ చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.



ఆలపాటి సురేష్‌కుమార్, కేఎస్ జవహర్, ఈశ్వర్‌లను సత్కరించి జ్ఞాపికలు అందజేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

ఎంపీ శివనాథ్‌ను కలిసిన కొత్త చైర్మన్లు

వన్‌టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్, కుమ్మరి-శాలివాహన సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరపి ఈశ్వర్‌లు బుధవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ని గురునానక్ కాలనీలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ వారికి అభినందనలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఎంపీకి, నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజు, ఏపీ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, జిల్లా తెలుగు రైతు సంఘం అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు, బొప్పన భవకుమార్, దేవినేని చందు, బాబురావు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, గన్నే ప్రసాద్ (అన్న) తదితరులు ఉన్నారు.

బుడమేరుకు శాశ్వత పరిష్కారం

- గండ్లు పడిన కట్టకు సేఫ్టీ వాల్ నిర్మాణం
- వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఎనికేపాడు యూటీ వరకు మరో చానెల్
- 25 వేల క్యూసెక్కులు కొల్లేరులోకి
- బీడీసీ ద్వారా 37,500 క్యూసెక్కులు కృష్ణాలోకి
- మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి



బీడీసీ గండ్ల వద్ద సేఫేజ్ ప్రాంతంలో సమాంతర వాల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

ఇబ్రహీంపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి) : బెజవాడ దుఃఖదాయిని బుడమేరు వరదల నుంచి విజయవాడ పల్లపు ప్రాంతాల ప్రజలకు శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. కొండపల్లి మున్సిపాలిటీ శాంతినగర్ వద్ద బుడమేరు డైవర్షన్ చానెల్ (బీడీసీ)కి గత ఏడాది వరదలకు మూడు గండ్లు పడిన విషయం తెలిసిందే. యుద్ధప్రాతిపదికన పూడ్చించిన కట్టకు సమాంతరంగా సేఫ్టీ వాల్ నిర్మాణ పనులను బుధవారం మైలవరం ఎమ్మెల్యేతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో గండ్లు పడిన చోట 500 మీటర్ల మేర పర్మినెంట్‌గా సీసీ వాల్ నిర్మాణం చేపట్టేందుకు రూ.28 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించి జూన్ 10 నాటికి వాల్ నిర్మాణం పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్టు చెప్పారు. ఇప్పుడు ఒక యూనిట్ మాత్రమే పనిచేస్తుందని మూడు యూనిట్లు పెంచి ఖచ్చితంగా పూర్తి చేయాలన్నారు. బుడమేరు నుంచి విజయవాడను రక్షించాల్సిన అవసరం ఉందని, అందులో భాగంగా వెలగలేరు రెగ్యులేటర్ నుంచి ఎనికేపాడు యూటీ వరకు ఉన్న పాత బుడమేరును అభివృద్ధి చేయడంతో పాటు దానికి సమాంతరంగా కాలువ తీసి దాని ద్వారా సుమారు 25 వేల క్యూసెక్కుల వరద నీరు ఎనికేపాడు యూటీ నుంచి కొల్లేరులో కలిపే విధంగా భూసేకరణ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. బీడీసీ నుంచి 37,500 క్యూసెక్కుల నీటిని కృష్ణా నదిలో కలిపేందుకు అసరమైన పనులు పూర్తి చేస్తామన్నారు. డీపీఆర్ మొత్తాన్ని సీఎం చంద్రబాబు వద్ద పెట్టి రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ముందుకు పోతామన్నారు. ఈ పనులన్నింటికి సుమారు రూ.6 వేల నుంచి రూ.8 వేల కోట్లు నిధులు అవసరం అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో విపత్తుల విభాగం నుంచి ఈ పనులు చేపట్టాలనే ఉద్దేశంలో డీపీఆర్‌ను తయారు చేస్తున్నామన్నారు. కేంద్ర సాయంతో పనులు పూర్తి చేస్తామన్నారు. వర్షాకాలం వచ్చే లోపే బుడమేరుకు పడిన గండ్లు పూడ్చిస్తామన్నారు. బుడమేరు, ఇరిగేషన్, చెరువులు ఇతర స్థలాలు కబ్జా చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. పట్టించుకోని అధికారులపైనా చర్యలుంటాయన్నారు. ప్రధాన గండికి పూర్తి భద్రత కల్పించేందుకు నిధులు మంజూరు చేసిన మంత్రికి మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కృతజ్ఞతలు చెప్పారు. మొత్తం 188 ప్రదేశాల్లో గండ్లు పడ్డాయని, వాటిలో 40 చోట్ల పనులు పూర్తి చేయించామన్నారు. 127 పనులకు రూ.40 కోట్లు ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

బుడమేరు సమగ్రాభివృద్ధికి నిధులివ్వండి

- సీఎం చంద్రబాబును కోరిన ఎమ్మెల్యే వసంత

ఇబ్రహీంపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి) : బుడమేరు సమగ్రాభివృద్ధికి అవసరమైన నిధులివ్వాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడ్ని కలిసి విజ్ఞప్తి చేశారు. గతేడాది ఆకస్మిక వరదల వల్ల మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా దెబ్బతిన్న వాగులు, చెరువులు, ఎన్ఎస్పీ కాలువల మరమ్మతులకు, గండ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. బుడమేరు 70శాతం పైగా మైలవరం నియోజకవర్గంలోనే ఉందని తెలిపారు. సీఎం సానుకూలంగా స్పందించారని వసంత తెలిపారు.

ఎంఎస్ఎంఈ పార్కుల్లో చేనేత

- దసరాలోగా చేనేత సహకార ఎన్నికలు
- ఇళ్ల నిర్మాణాల్లో రూ.50వేల ఆర్థికసాయం
- 90 శాతం రాయితీతో పనిముట్లు
- త్వరలో కార్మికులకు హెల్త్ ఇన్సూరెన్స్
- నేతన్నలతో మంత్రి సవిత



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న మంత్రి సవిత, చిత్రంలో ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి

విజయవాడ, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కల్పనలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయడంతోపాటు యూనిట్ల స్థాపనకు నేతన్నలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు రాష్ట్ర బీసీఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బుధవారం నగరంలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నేతన్నలతో ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డితో కలిసి ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాల్లో చేనేతలకు అదనంగా రూ.50వేలు అందజేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో ఉన్న ఎన్‌హెచ్‌డీఎస్ రీజనల్ కార్యాలయం విజయవాడలో ఏర్పాటు చేసేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. 90శాతం సబ్సిడీతో ఆధునిక పనిముట్లు అందజేస్తామన్నారు. చేనేత అమ్మకాలు పెరిగేలా కూటమి ప్రభుత్వం రాష్ట్ర, జాతీయస్థాయిలో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తోందని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వారంలో ఒకరోజు చేనేత దుస్తులు తప్పనిసరిగా ధరించేలా త్వరలో పిలుపునివ్వనున్నట్టు తెలిపారు. దసరాలోగా చేనేత సహకార సంఘ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. నేత కార్మికులకు త్వరలో హెల్త్ ఇన్సూరెన్స్ అమలు చేస్తామని చెప్పారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందజేస్తామని చెప్పారు. 2019-24 మధ్య నేతన్నలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. త్రిఫ్ట్ పథకం కింద కేటాయించిన రూ.5 కోట్లను త్వరలో విడుదల చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో చేనేత, జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి, సెర్ప్ సీఈవో కరుణ, ఆప్కో వీసీ అండ్ ఎండీ ఎం.విశ్వ, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ అబద్దయ్య, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తెలుగువారిని ఏకం చేసిన శ్రీకృష్ణదేవరాయలు

- జస్టిస్ దుర్గాప్రసాద్

ఘంటసాల, మే 14 (ఆంధ్రజ్యోతి) : సాహిత్యం, సంస్కృతిపరంగా తెలుగువారిని ఏకం చేసిన వ్యక్తి శ్రీకృష్ణదేవరాయలు అని ఏపీ హైపవర్ కమిటీ చైర్మన్ జస్టిస్ యు.దుర్గాప్రసాద్ కొనియాడారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలో శ్రీ కాకుళాంధ్ర మహావిష్ణు దేవాలయ ప్రాంగణంలో బుధవారం రాత్రి శ్రీకృష్ణదేవరాయల



జ్యోతి ప్రజ్వలన చేసి మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్ దుర్గాప్రసాద్, పక్కన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

మహోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జస్టిస్ వి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. శ్రీకృష్ణదేవరాయలు నడయాడిన ఈ ప్రాంతానికి రావటం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. మహాకావ్యాలు వెలుగులోకి వచ్చాయంటే దైవఅనుగ్రహం వల్లే సాధ్యమన్నారు. అద్భుతమైన అముక్తమాల్యద కావ్యాన్ని కృష్ణదేవరాయలు రచించారన్నారు. మనమందరం శ్రీకృష్ణదేవరాయల వారసులమన్నారు. మాతృభాషను భవిష్యత్‌తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరికి ఉందన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. శ్రీకృష్ణదేవరాయలకు స్ఫూర్తి ప్రదాత ఆంధ్రమహావిష్ణువు అన్నారు. తెలుగుభాషను రాజ్యభాషగా చేసిన వ్యక్తి శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. తొలుత దుర్గాప్రసాద్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శ్రీకాకుళేశ్వరస్వామివారిని దర్శించుకుని, అనంతరం దేవాలయ ప్రాంగణంలోని కృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌరవ అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా రచయితల సంఘం కార్యదర్శి జి.వి.పూర్ణచంద్, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గోదా కల్యాణం నృత్య రూపకం

అముక్తమాల్యద కావ్యం నుంచి రచించిన గోదా కళ్యాణం నృత్యరూపకం విశేషంగా ఆకట్టుకుంది. రచన రాళ్లబండి కవితా ప్రసాద్, కెవి.సత్యనారాయణ, కృష్ణదేవరాయలుగా నృత్య దర్శకులు కళారత్న కేవీ సత్యనారాయణ, గోదాగా సీహెచ్‌లోహిత, రంగనాథులుగా కె.అక్షర, శివుడిగా వర్ష, పార్వతీగా శివాక్షిత, బ్రహ్మగా లక్ష్మీ భవాని, సరస్వతీగా పయింద, విష్ణు చిత్తుడుగా జ్యోతి, నృత్య కళాకారులుగా కె.ప్రశాంత్, కె.మాధవి, కామాక్షి, నిఖిత, భార్గవి, హసీన్ బీ, చిరంజీవులు నటించారు.

ధన కార్యాలు!

(5వ పేజీ తరువాయి)

సంతకాలు లేని అలైన్‌మెంట్లను పట్టుకెళ్లి క్షేత్ర స్థాయిలో పెగ్ మార్క్ చేయటం వ ంటి పనులతో రైతులు బెంబేలెత్తిపోయారు. అలైన్‌మెంట్ పేరుతో అక్కడ టవర్లు వస్తున్నాయి.. ఇక్కడ టవర్లు వస్తున్నాయంటూ రైతులను భయాందోళనలకు గురిచేశాడని తెలుస్తోంది. హైటెన్షన్ ట్రాన్స్‌మిషన్ టవర్ పడితే భవిష్యత్తులో తమ భూములను కొనేవారు ఎవరూ ఉండరని భయపడిన రైతుల నుంచి దండిగా లంచాలు వసూలు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎకరం రూ.కోటిపైన ఖరీదు చేసే భూముల రైతుల నుంచి డబ్బులు తీసుకుని వేరే పొలంలోకి టవర్ వెళ్లే విధంగా అలైన్‌మెంట్‌ను ఫిక్స్ చేశాడని సమాచారం. ఇలా తన ఆఫర్‌ను అంగీకరించిన రైతులకు మేలు చేసినట్టు తెలిసింది. మొత్తం ఆరు లైన్ల విషయంలో కూడా కాంట్రాక్టు ఉద్యోగి ఇదే విధంగా వ్యవహరించాడని సమాచారం. ట్రాన్స్‌కో, పీజీసీఐఎల్, ల్యాంకో లైన్స్ అన్నింటి విషయంలోనూ ఆ ఉద్యోగి ఇదే విధంగా చేశాడని తెలుస్తోంది. ల్యాంకో లైన్స్‌ను అర్ధ చంద్రాకారంగా రైతుల పొలంలో తిప్పటం వెనుక కూడా ఆ ఉద్యోగి హస్తం ఉందని తెలుస్తోంది. టవర్లను రీ లొకేట్ చేస్తున్న కాంట్రాక్టు సంస్థతో కలిసి ఆ ఉద్యోగి ఇష్టానుసారం టవర్లను మార్చి గందరగోళాన్ని సృష్టించినట్టు సమాచారం. నున్న, సూరాయపాలెం రైతులు ఈ అలైన్‌మెంట్‌పై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఫిర్యాదు చేయటంతో అసలు ఈ అలైన్‌మెంట్ ఏ విధంగా వస్తుందన్నదానిపై ఆయన కూడా విచారణకు ఆదేశించారు.

అధీకృత అలైన్‌మెంట్ ఎలా ఉండాలి? క్షేత్ర స్థాయిలో ఏమి చేశారు?

ముందుగా నిర్దేశించుకున్న అలైన్‌మెంట్ ప్రకారం ఏయే రైతుల పొలాల్లో టవర్లు పడుతున్నాయో గుర్తించి ఆ రైతులకు ముందుగా సమాచారాన్ని తెలియపరచాలి. ఆ తర్వాత వారి సమక్షంలో టవర్ లొకేషన్ ఎక్కడ వస్తుందో అధికారిక అలైన్‌మెంట్ కాపీని చూపించి పెగ్ మార్క్ చేయాల్సి ఉంటుంది. కానీ, సదరు ఉద్యోగి అధీకృతం కానీ ప్లాన్ కాపీతో వచ్చి పెగ్ మార్కింగ్ పనులతో రైతులను భయాందోళనలకు గురి చేశారు. అధీకృత అలైన్‌మెంట్ కాపీ మీద ఏఈ, డీఈఈ, ఈఈ, ఎస్ఈ సంతకాలు ఉండాలి. ఆ తర్వాత ఎన్‌హెచ్ పీడీ సంతకాలు ఉండాలి. ఈ సంతకాలు అన్నీ ఉంటేనే అది అధీకృత అలైన్‌మెంట్ కాపీ అవుతుంది. ఎలాంటి సంతకాలు లేకుండా అలైన్‌మెంట్ ప్రింట్ తీసుకు వచ్చి రైతులను భయభ్రాంతులకు గురి చేశారు. వీటి గురించి రైతులకు పెద్దగా తెలియదు. దీంతో అతడు ఆడింది ఆట పాడింది పాటగా సాగింది.

డబుల్ దోపిడీ

అలైన్‌మెంట్ పేరుతో డబుల్ దోపిడీ జరిగిందని తెలుస్తోంది. ముందుగా ప్రస్తుత అలైన్‌మెంట్‌లో ఉన్న రైతులతో మాట్లాడి నీ పొలం నుంచి టవర్ తీసేస్తాం.. ఎంత ఇస్తావ్ ? అని బేరం పెట్టినట్టు తెలిసింది. ఆ తర్వాత కొత్తగా వెళ్లే భూముల రైతులతో నీ పొలంలో టవర్ పడుతుంది! పడకుండా ఉండాలంటే ఎంత ఇస్తావ్? అంటూ బేరసారాలు సాగించినట్టు సమాచారం. ఇలా రైతుల అమాయకత్వాన్ని, ఖరీదైన భూములను కాపాడుకోవాలన్న వారి ఆశలను ఎంచక్కా మన కాంట్రాక్టు ఉద్యోగి భారీగా క్యాష్ చేసుకున్నట్టు తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బైక్‌పై వచ్చి.. కార్లను మార్చే రేంజ్‌కి..

కాంట్రాక్టు ఉద్యోగి ఎన్‌హెచ్‌లో ప్రవేశించే ముందు ఓ బైకును ఉపయోగించినట్టు సమాచారం. విజయవాడ వెస్ట్ బైపాస్ పుణ్యమా అని అతను ఇప్పుడు కారులో ఆఫీసుకు వచ్చే రేంజ్‌కు ఎదిగాడని తెలిసింది. ఒక కారు అయితే అనుకోవచ్చు.. ఇప్పటికి రెండు కార్లను మార్చినట్టు సమాచారం.

బైపాస్ వెంబడి పెట్రోల్ బంకు కోసం స్థలాన్వేషణ

సదరు కాంట్రాక్టు ఉద్యోగి విజయవాడ వెస్ట్ బైపాస్ వెంబడి పెట్రోల్ బంకును ఏర్పాటు చేయటానికి స్థలాన్వేషణ చేస్తున్నట్టు తెలిసింది. విజయవాడ వెస్ట్ బైపాస్ ప్రారంభమయ్యే లోపు అనువైన స్థలాన్ని కొనుగోలు చేసి అందులో పెట్రోల్ బంకును ఏర్పాటు చేయాలన్నది అతని ఆలోచనగా ఉన్నట్టు సమాచారం. విజయవాడ వెస్ట్ బైపాస్ వెంబడి ఒక ఎకరం కొనాలంటే కనిష్ఠంగా రూ. కోటి నుంచి గరిష్ఠంగా రూ.7 కోట్ల వరకు ఉంది.

మెట్రోకు మంచి తరుణం

(5వ పేజీ తరువాయి)

విజయవాడ మెట్రోకు రూ.5,900 కోట్ల రుణం ఇచ్చేందుకు ఏఐఐబీ ప్రతినిధులు అంగీకరించారు. విజయవాడ మెట్రోరైల్ కార్పొరేషన్ అధికారులు కూడా ఈ రుణం తీసుకోవాలని భావిస్తున్నట్టు సమాచారం. ఎందుకంటే ఈ సంస్థ ఇచ్చే రుణాన్ని 35 ఏళ్ల వరకు తీర్చుకునే వెసులుబాటు ఉంది. జైకా సంస్థ అయితే 40 ఏళ్ల వరకు రుణం తీర్చుకునే అవకాశం కల్పించినా ఆంక్షలు ఇబ్బందికరంగా మారాయి. అలాగే, జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ, ఫ్రాన్స్‌కు చెందిన ఏఎఫ్‌డీతో పాటు ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ), నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ), ప్రపంచ బ్యాంకు (డబ్ల్యూబీ) వంటి సంస్థలను కూడా ఆహ్వానించాలని మెట్రో అధికారులు భావిస్తున్నారు.

పైసల్ మత్తు!

(5వ పేజీ తరువాయి)

చెందిన మద్యం స్వాధీనం చేసుకున్నామని, దీనిపై కేసు నమోదు చేశామని చెబుతుండటం గమనార్హం.

బార్ అండ్ రెస్టారెంట్‌లకు మద్యం తరలింపు

క్వార్టర్ మద్యం సీసాలను దుకాణంలోని వారు బార్ అండ్ రెస్టారెంట్‌కు పెద్ద ఎత్తున తరలిస్తున్నారు. రూ.85 క్వార్టర్ బాటిల్‌ను మద్యం దుకాణంలో రూ.99లకే విక్రయించాలి. అదే బార్ అండ్ రెస్టారెంట్‌లో దీన్ని రూ.140 నుంచి రూ.150 వరకు అమ్ముతున్నారు. మద్యం దుకాణం, బార్ అండ్ రెస్టారెంట్లకు సరఫరా చేసే మద్యం ధరల్లో తేడాలు ఉండటంతో బార్ అండ్ రెస్టారెంట్ యజమానులు వీరితో కుమ్మక్కై గుడివాడ, మచిలీపట్నం ఉయ్యూరు తదితర ప్రాంతాల్లో ఈ దందా నిర్వహిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. మచిలీపట్నంలోని పోతేపల్లిలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం భవనంపై సిట్టింగ్ రూమ్ మాదిరిగా ఏర్పాటు చేసి అక్కడ మద్యం తాగించడం, మందుబాబుల అల్లరి అధికం కావడంతో స్థానికులు ఇటీవల ధర్నాకు దిగారు. చిన్నాపురం. సుల్తానగరంతోపాటు వివిధ ప్రాంతాల్లో మందు తాగేందుకు సిట్టింగ్ రూమ్‌లను ఏర్పాటు చేసి మరీ మద్యం విక్రయాలు జరుపుతున్నారు. గుడివాడ సమీపంలోని మండలంలో గౌడ సామాజికవర్గం కోటాలో ఇటీవల ఏర్పాటు చేసిన మద్యం దుకాణం నుంచి నెలకు ఇంత ఇవ్వాలని సివిల్ పోలీసులు సైతం వెంట పడుతుండటంతో కొత్తగా వ్యాపారం ప్రారంభించిన వారు బెంబేలెత్తిపోతున్నారు.

రాజకీయం రసవత్తరం

(5వ పేజీ తరువాయి)

రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 23న జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆమె రాజీనామాను ఆమోదించారు. దీంతో గత ఒప్పందం ప్రకారం చైర్‌పర్సన్ పదవి ఆశిస్తున్న మోదుగు ప్రసాద్ మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో చైర్మన్ ఎన్నికకు సంబంధించి ఈ నెల 12న నోటిఫికేషన్ జారీ కాగా, 19న ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో తిరువూరులో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. వైసీపీకి చెందిన కొందరు కౌన్సిలర్లు పక్కచూపులు చూస్తున్నట్టు ప్రచారం జరిగింది. ఎనిమిది మంది కౌన్సిలర్లు పార్టీ మారుతున్నారని, ప్రస్తుత మున్సిపల్ బోర్డు వైసీపీ చేయి జారుతుందనే ప్రచారంతో నాయకులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే పలుమార్లు తమ కౌన్సిలర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో చైర్మన్ పీఠం పార్టీ చేజారిపోకూడదనే ఆలోచనతో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు ఆధ్వర్యంలో క్యాంప్ రాజకీయానికి తెరలేపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లపై ఇంటింటా ప్రచారం



హనుమాన్‌జంక్షన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలను ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని బాపులపాడు జడ్పీ హైస్కూల్ హెచ్ఎం టీవీ నాగే శ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. బాపు లపాడు జడ్పీ హైస్కూల్‌లో అడ్మిషన్ల వివరాలు తెలుపుతూ మంగళవారం రాత్రి స్థానిక ఎంజీ నగర్‌లో ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. హైస్కూల్‌లో 6నుంచి 10 వరకు, హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ కోర్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



విరాళం అందజేస్తున్న రత్నప్రసాద్

గో సంపదను పెంచుకోవాలి

గన్నవరం, మే 14 (ఆంధ్రజ్యోతి) : గోవులను గోశాలలకు కాకుండా గ్రామాల్లో గో పోషణ చేసే వారికి ఇవ్వాలని అందజేస్తే గో సంపద పెరుగుతుం దని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పిడికిటి రత్నప్ర సాద్ అన్నారు. గన్నవరానికి చెందిన కాసన్నేని రాజాకు చెందిన త్యాగి, సింహ అనే పేరు గల గిత్తలు బలప్రదర్శన ద్వారా కీర్తి ప్రతిష్టలు తెచ్చిపె ట్టాయి. ఇప్పుడు వయోభారం వల్ల నడవలేని స్థితిలో ఉండటంతో వాటి పోషణార్థం రూ.25వేలు చెక్కును బుధవారం స్థానిక శివాలయంలో రత్న ప్రసాద్ ఆలయ అర్చకులు మల్లంపల్లి సాంబశివరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గో ప్రేమికులు గోవుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కాసన్నేని శ్రీను తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నవజీవన్ బాల భవన్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ వసంత్‌కుమార్

విద్య, ఆరోగ్యంతోనే సమాజాభివృద్ధి

కంకిపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి) : సరైన విద్య, ఆరోగ్యంతోనే సమాజాభివృద్ధి సాధ్య మవుతుం దని నవజీవన్ బాల భవన్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ వసంత్‌కుమార్ అన్నారు. విజయ వాడ డాన్‌బాస్కో నవజీవన్ బాలభవన్ సంస్థ ఆధ్వర్యంలో కంకిపాడు బచ్చుపేటలో విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రు లకు విద్య, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వసంత్‌కుమార్ మాట్లాడుతూ, విద్యతోనే ఆర్థిక ఇబ్బంది జరుగుతోందన్నారు. చదువు కునే వయస్సులో ఆడుకుంటూ చదువుకోవాలని, విద్యను భారంగా కాకుండా బాధ్యతగా భావించాలని సూచిం చారు. బేదా తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ నది పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

గన్నవరం, మే 14 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం నుంచి సరస్వతీ నది పుష్కరాలకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ పి.శివాజీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 15 నుంచి జరుగుతున్న సరస్వతీ నది పుష్కారాలకు భక్తుల సౌకర్యార్థం గన్నవరం డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సు వరంగల్ భద్రకాళీ దేవాలయం, వేములవాడ రాజరాజేశ్వరీ దేవాలయం, కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయం, ధర్మపూరి లక్ష్మీనరసిస్వామి దేవా లయం, కాళేశ్వరం మహాకాళేశ్వరం ఆలయం దర్శిం చుకుని పుష్కరస్నానం తరువాత రామప్ప దేవాల యం దర్శనం చేసుకోవచ్చన్నారు. ఈ బస్సు 21 బుధవారం సాయంత్రం గన్నవరంలో బయలుదేరి తిరిగి 24వ తేదీ ఉదయం వస్తుందని ఈ అవకా శాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 73829-05633, 87909-96090 నెంబర్‌లను సంప్రదించాలని కోరారు.

పల్లెబాట 21 నుంచి

హనుమాన్‌జంక్షన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర సంకల్పంలో భాగంగా బాపులపాడు మండ లంలో మూడు రోజులు పాటు పల్లెబాట కార్యక్ర మాన్ని నిర్వహించనున్నట్లు బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21నుంచి 23 వరకు శేరీనరసన్నపాలెం, కె.సీతా రాంపురంలో పల్లెబాట నిర్వహిస్తారని తెలిపారు.

గుంతలమయం!

● కుందేరు రోడ్డులో ఇబ్బందిపడుతున్న ప్రజలు, వాహనదారులు

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

విజయవాడ - మచిలీపట్నం హైవే నుంచి మూర్తిరాజుపాలెం, కుందేరు రోడ్డు గుంతలమయంగా తయారై ద్విచక్రవాహనాలు సైతం వెళ్లేందుకు వీలులేక ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. హైవే నుంచి మూర్తిరాజు పాలెం మీదుగా కుందేరు వెళ్లే రోడ్డు పొడవునా గుంతలు ఏర్పడగా వర్షాలకు నీరు నిలిచి నడిచేందుకు సైతం ఇబ్బందికరంగా ఉండటంతో ప్రజలు అసౌక ర్యానికి గురవుతున్నారు. మండల పరిధిలో పొట్లపాడు, కడవకొల్లు గ్రామాల కు కూడా ఇదే రోడ్డు ఉపయోగిస్తుంటారు. ఈ పరిస్థితుల్లో రోడ్డు గుంతలు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.



మూర్తిరాజుపాలెం - కుందేరు రోడ్డు గుంతల్లో నిలిచిన వర్షం నీరు

సుందరీకరణ పనులు వేగవంతం చేయండి

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ప్రసాదంపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి) : జాతీ య రహదారి డివైడర్, ఫుట్‌పాత్‌ల సుందరీ కరణ పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులను ఆదేశిం చారు. బుధవారం సుందరీకరణ పనుల ప్రగతిపై విజయవాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యా లయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ రావతి రాకపోకలు సాగించేందుకు అందుబాటు లో ఉన్న ఏకైక విమానాశ్రయం గన్నవరం కావడంతో పారిశ్రా మిక వేత్తలు, వీఐపీలు వస్తుంటారన్నారు. డివైడర్‌పై మొక్కలు లేని చోట మొక్కలు నాటాలని, ఫుట్‌పాత్‌లపై కుండీలు ఏర్పాటు చేసి వాటిలో మొక్కలు పెట్టాలని అధికారులకు సూచించారు. డివైడర్‌లకు ఆకర్షణీయమైన రంగులు వేసి సుంద రంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా డీపీవో ధర్మరాజు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మరణించిన మరీదు గోవిందులు కుటుంబ సభ్యులకు రాష్ట్ర విద్యుత్ శాఖ నుంచి పరిహారంగా రూ. 5 లక్షలు అందేలా చొరవ చూపిన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావును బుధవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో మృతిడి కుటుంబ సభ్యులు మార్యదపూర్వకంగా కలిశారు. తమ కుటుంబానికి అండగా నిలిచి పరిహారం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ, కార్యకర్తలకు, అభిమానులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో మృతిడి కుటుంబ సభ్యులు బండారుగూడెం గ్రామ పార్టీ అధ్యక్షులు కొండేటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మృతుడు మరీదు గోవిందులు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

అర్హులందరికి అన్నదాత సుఖీభవ

గన్నవరం : అర్హులైన రైతులందరికి రాష్ట్ర ప్రభు త్వం ప్రవేశపెడుతున్న అన్నదాత సుఖీభవ పథకా న్ని అందజేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగ డ్డ వెంకట్రావు హామీ ఇచ్చారు. మంగళవారం రాత్రి గన్నవరం ఎంపీడీవో కార్యాలయంలో వ్యవసాయ, విద్యుత్, ఇంతర అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్నదాత సుఖీభవ పథకం అర్హులైన రైతులందరికి అందించేలా అధికారులు జాబితాలు సిద్ధం చేయాలని ఆదేశించారు.



విద్యార్థినికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, గుర్రాల మధు

విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి

ఉయ్యూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పరీక్షల్లో రూ. 579 మా ర్కులు సాధించిన చిట్టూరి మౌనికకు గుర్రాల మధు సహకారంతో రూ. 10వేల నగదు ప్రోత్సాహక బహుమతిని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ద్వారా బుధవారం అందజేశారు. కంకిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివి పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన మౌనికను ప్రోత్సహిస్తూ నగదు బహు మతి అందజేయడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. పరీక్షలకు రెండు రోజుల ముందు తండ్రి గుండెపోటుతో మృతి చెందినా పుట్టెడు దుఃఖాన్ని దిగ మింగుకొని పరీక్షలు రాసి 579 మార్కులు సాధించిన మౌనికను తోచిన విధంగా ప్రోత్సహించడం ఎంతో సంతోషకరంగా ఉందని గుర్రాల మధు అన్నారు.



ఉప్పలూరు వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శర్మిష్ట

మెరుగైన వైద్య సేవలందించండి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ శర్మిష్ట

కంకిపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన వైద్య సేవలం దించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శర్మిష్ట వైద్యసిబ్బందికి సూచించారు. మండలంలోని ఉప్పలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆమె ఆకస్మి కంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చే రోగులకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. గ్రామాల్లోని ఫీల్డ్ లెవల్‌లో పనిచేసే ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందు బాటులో ఉండాలని సూచించారు. వైద్యాధికారులు డాక్టర్ అంజు, డాక్టర్ సాయి నిఖిత, ఎంపీహెచ్ఈవో కృష్ణారావు, పీహెచ్ఎన్ రాజామణి పాల్గొన్నారు.



ఇందుపల్లిలో టీడీపీ నాయకుడు యోహాన్ ఇంటిముందు గుమిగూడిన ఉపాధి శ్రామికులు

ఉపాధి శ్రామికుల దూషణలపై ఫిర్యాదు

ఉంగుటూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనుల్లో అవకతవకలపై విజి లెన్స్ అధికారులకు తాను సమాచారమిచ్చానని, నిందారోపణలు చేస్తూ బుధవా రం ఉదయం సుమారు 20మంది ఉపాధి మహిళా శ్రామికులు తనను దూషిం చారని ఇందుపల్లికి చెందిన టీడీపీ మండల కార్యనిర్వాహణ కార్యదర్శి ఇందుపల్లి యోహాన్ ఆరోపించారు. జరిగిన ఘటనపై ఉంగుటూరు ఎస్సై యు.గోవిందు, ఎంపీడీవో సత్యకుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

● టీడీపీ నాయకుడు యోహాన్‌ను దూషించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధితుడికి న్యాయం చేస్తామని ఎంపీడీవో ఈ.సత్యకుమార్ తెలిపారు.

వేసవి శిక్షణ శిబిరానికి విశేష స్పందన

ఉయ్యూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరానికి విద్యార్థుల నుంచి విశేషస్పందన లభిస్తుంది. శిక్షణలో పలు అంశాల్లో ప్రావీణ్యం పొందేందుకు పలు వురు విద్యార్థులు ప్రతిరోజు వచ్చి క్రమశిక్షణతో వ్యవహరిస్తున్నారు. శిక్షణలో భాగంగా బుధవారం ఇండియన్ జాగ్రఫీలోని నదులు, వాటి జన్మస్థలాలను రిసోర్స్‌పర్సన్ బి.గో పాలకృష్ణ వివరించారు. అనంతరం విద్యార్థులతో పి. శ్రీరామ్ యోగాసనాలు నేర్పించారు. గ్రంథాలయ అధికారి బి.రమణి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు భరోసా ఒకేసారి జమచేయాలి

గన్నవరం, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా రూ.20 వేలు ఒకేసారి రైతుల ఖాతాలో జమ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయ కులు కొలుసు శ్రీమన్నారాయణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన సంఘం కార్యాలయంలో మాట్లాడుతూ, ప్రస్తుతం ఆ నగదు మూడు సార్లుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం అంటుందని ఈ విధంగా చేయటం వల్ల రైతులకు వ్యవసాయ అవసరాలు తీరవన్నారు. ఒకేసారి నగదు మొత్తం రైతుల ఖాతాల్లో వేస్తే వ్యవసాయం చేసుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

సమ్మె జయప్రదం చేయాలని బైక్ ర్యాలీ

పెనమలూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : కార్మికులు, రైతులు చేస్తున్న సమ్మె ను జయప్రదం చేయాలని కోరుతూ పోరంకి సీఐటీయూ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. పోరంకి సెంటర్ మీదుగా పెనమలూరు, తాడిగడప సెంటరు మీదుగా కానూరు కొత్త ఆటోనగర్ వరకు సాగిన ఈ ర్యాలీలో సీఐటీయూ నాయకులు కరపత్రాలు పంచారు. 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. బైక్ ర్యాలీలో సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు, ఎస్కే కాసిం, మధిర ఏడుకొండలు, దాసరి డేవిడ్, వెంకటరెడ్డి, ఆర్ వేణు, సురేష్, సీహెచ్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా శాంతియుతంగా జీవించాలి

ఉంగుటూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజలంతా ఐక్యతాభావంతో మెల గుతూ శాంతియుతంగా జీవించాలని రెవరెండ్ ఫాదర్ అవినాష్ అన్నారు. మండ లంలోని తుట్టగుంటలో పునీత జోజప్ప(ఆర్‌సీఎం)దేవాలయం మొదటి వార్షికో త్సవ వేడుక బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఫాదర్ అవినాష్ పరిశుద్ధ దివ్యపూజాబలిని సమర్పించి తన సందేశాన్నందిం చారు. ప్రతి ఒక్కరూ దేవుని పట్ల నమ్మకం కలిగి వుండాలని, తోటి వ్యక్తులను ప్రే మించాలని బోధించారు. పెదఅవుటపల్లి విచారణ గురువులు గోపు అభిలాష్ మాట్లాడుతూ, గ్రామస్థుల ఐక్యత, సమిష్టి కృషితోనే చిన్నగ్రామమైన తుట్టగుం టలో ఇంతటి అద్భుతమైన ఆలయనిర్మాణం చేయడం జరిగిందన్నారు. ఆలయ ని ర్మాణానికి కారకులైన గుడిసే బాలస్వామి పేరు చిరస్థాయిగా వుంటుందన్నారు. ఈసందర్భంగా బాలస్వామి కుటుంబ సభ్యుల సహకారంతో భక్తులందరికీ ప్రత్యేక విందును ఏర్పాటు చేశారు. ఫాదర్లు ఏసుపాదం, సుధీర్, సర్పంచ్ బి.కృష్ణారెడ్డి, మాజీసర్పంచ్ గుడిసే రాణి, గుడిసే రాయప్ప, నిర్మలరాజు పాల్గొన్నారు.



తుట్టగుంట పునీత జోజప్ప దేవాలయ వార్షికోత్సవంలో దివ్యపూజాబలిని సమర్పిస్తున్న ఫాదర్ అవినాష్, విచారణ గురువులు

యోగా అభివృద్ధికి ప్రధాని మోదీ విశిష్ట కృషి

మంత్రి సత్యకుమార్ యాదవ్

పెనమలూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ అతి పురాతన ఆరోగ్య విధానమైన యోగాను దేశంలోనే కాకుండా ప్రపంచమంతా గుర్తించి ఆచరించేలా చేసిన వ్యక్తి ప్రధాని మోదీ అని ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం అమరావతి లోని తన కార్యాలయంలో డాక్టర్ మాకాల సత్యనారాయణతో కలిసి అంతర్జాతీయ యోగా దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ, మోదీ ప్రధాని కాగానే వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్‌తో మాట్లాడి యోగా అవస రాన్ని తెలియజెప్పి యోగాభ్యాసాన్ని ప్రపంచవ్యాప్తం చేశారని కొనియాడారు. కరోనా సమయంలో భారత్‌తో పాటు ప్రపంచం మొత్తానికి తన ఫిట్నెస్ యోగా రహస్యా లను తెలియజెప్పి ప్రాణనష్టాన్ని తగ్గించిన వ్యక్తి మోదీ అని వ్యాఖ్యానించారు. యోగశక్తి ద్వారా అనేక రకాల రోగాలను నయం చేయవచ్చని తెలిపారు.



యోగా దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్

బందరు ముఖచిత్రం మార్చేద్దాం

కృష్ణాజిల్లా చరిత్రను చాటేలా మసూలా బీచ్ ఫెస్ట్

● క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనలకు ప్రాధాన్యత ● జూన్ మొదటి వారంలో బీచ్ ఫెస్టివల్
● సీఎం చంద్రబాబు రాక ● స్వదేశీ దర్శన్ పథకం కింద రూ.120 కోట్లు : మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో కృష్ణాజిల్లా చరిత్రను చాటిచెప్పేలా జూన్ మొదటి వారంలో మసూలా బీచ్ ఫెస్ట్-2025 నిర్వహిస్తామని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం మంగినపూడి బీచ్‌లో జరుగుతున్న బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లపై మంత్రి కొల్లు రవీంద్ర అధికారులతో చర్చించారు. ఆర్డీవో స్వాతి, ఎలక్ట్రికల్ ఏడీ, పోలీస్, టూరిజం, స్పోర్ట్స్, రవాణాశాఖ అధికారులతో చర్చించారు. సినీఆర్ట్ డైరెక్టర్, డిజైనర్ వంకా రమణతో తయారు చేయించిన పలు కళాఖండాల ఆకృతులను మంత్రి పరిశీలించారు. బీచ్ రోడ్డు వెడల్పు పనులను పరిశీలించారు. బీచ్ కబడ్డీ క్రీడాకారులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మే 15 నుంచి జరగాల్సిన బీచ్ ఫెస్టివల్‌ను జూన్ మొదటి వారానికి వాయిదా వేశామన్నారు. మొదటి రోజు 2వేల మంది క్రీడాకారులతో జాతీయ బీచ్ కబడ్డీ, జల క్రీడలు పోటీలు నిర్వహిస్తామన్నారు. పారా గ్లైడింగ్, హెలికాప్టర్ రైడింగ్, నీటిలో నడిచే స్కూటర్లు, మోటారు స్పీడ్ బోట్లుతో సాహస క్రీడలు ఉంటాయన్నారు. అలాగే జెయింట్ వీల్స్, ఫ్లవర్ ఎగ్జిబిషన్, మ్యూజికల్ ఫౌంటేన్, ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేస్తామన్నారు. సినీ కళాకారులు, సంగీత దర్శకులతో సంగీత విభావరి నిర్వహిస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు కేంద్రమంత్రులను ఆహ్వానిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ స్వదేశీ దర్శన్ పథకం కింద రూ.150 కోట్లతో బీచ్‌లో అభివృద్ధి చేస్తామన్నారు. రీసార్ట్స్, హోటళ్లు నెలకొల్పేందుకు రూ.800 నుంచి వెయ్యి కోట్ల వరకు పెట్టుబడులు పెట్టే అవకాశాలున్నాయన్నారు. విజయవాడతో పాటు రాష్ట్ర రాజధాని అమరావతికి మచిలీపట్నం ముఖ ద్వారమన్నారు. హైదరాబాద్‌కు సమీపంలోనే ఈ బీచ్ ఉందన్నారు. మంత్రి వెంట ఆర్డీవో స్వాతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచేనాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, తహసీల్దార్లు నాగభూషణం, హరనాథ్, సీఐ ఏసుబాబు, విద్యుత్ శాఖ డీఈ రామకృష్ణ, రహదారులు, భవనాల శాఖ డీఈ సంగీత, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ తలారి సోమశేఖర్, లంకే హరికృష్ణ ఉన్నారు.


గేట్ వే ఆఫ్ అమరావతి కళాఖండం నమూనాను పరిశీలిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర


చిలకలపూడి మునిసిపల్ హైస్కూల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను హెచ్‌ఎంకు అందజేస్తున్న కుముదిని సింగ్

పాఠశాలలు ప్రారంభం కాకముందే
విద్యార్థులకు కిట్లు అందజేత

● ఆరో తరగతి విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీల సరఫరా

మచిలీపట్నం టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు ప్రారంభం కాకముందే జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో 6వ తరగతి చదివే విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు అందజేస్తున్నట్టు జిల్లా సమగ్ర శిక్ష నూతన ఏపీసీ కుముదిని సింగ్ తెలిపారు. చిలకలపూడి మునిసిపల్ హైస్కూల్‌లో విద్యార్థి మిత్ర కిట్ల స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీసీ కుముదిని సింగ్ మాట్లాడుతూ జిల్లాలోని 6వ తరగతి చదువుతున్న 7,632 మందికి ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు సరఫరా చేస్తున్నామన్నారు. హెచ్‌ఎం కృష్ణమూర్తికి విద్యార్థి కిట్లను అందజేశారు. సమగ్రశిక్ష సీఎంవో రమేష్, ఏఎంవో శ్యామ్, ఐఈ కో-ఆర్డినేటర్ రాంబాబు, ఏపీవో ఏడుకొండలు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న కుమారి

తూకంలో ఎలాంటి తేడాలు ఉండొద్దు

● తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ కుమారి

విజయవాడ, మే 14 (ఆంధ్రజ్యోతి): తూకంలో తేడా లేకుండా ఖచ్చితత్వం ఉండాలని, ఎలాంటి మోసాలకు పాల్పడొద్దని తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ బి.కుమారి అన్నారు. ప్రపంచ మెట్రోలజీ దినోత్సవం సందర్భంగా బుధవారం నగరంలోని బంగారు దుకాణాల అసోసియేషన్ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ ఖచ్చితమైన తూనికలు, పరికరాలు మాత్రమే ఉపయోగించాలన్నారు. బంగారు దుకాణాల్లో 1 మి.గ్రా తూకం ఉండాల్సిందేనన్నారు. ఇప్పటి వరకు కూరగాయల మార్కెట్లు, వంటనూనె తయారీదారులు, గ్రోసరీ రిటైల్ స్టోర్స్, ఫార్మస్యూటికల్స్ వినియోగదారులకు మాత్రమే అవగాహన కల్పించడం జరిగిందన్నారు. తూకంలో ఖచ్చితత్వంతో పాటు వాస్తవ ధరకు కన్నా అధిక ధరలకు అమ్మితే చర్యలుంటాయని బి.కుమారి హెచ్చరించారు.

కుమ్మరి శాలివాహన సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన సంఘనేతలు


ఈశ్వర్‌ను కలిసిన కుమ్మరి సంఘం నేతలు వీర్రాజు, రవి, వెంకట్

విద్యాధరపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కుమ్మరి - శాలివాహన సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన పేరేపి ఈశ్వర్‌ను బుధవారం అశోక్‌నగర్‌లోని ఆయన కార్యాలయంలో సంఘం నేతలు నెల్లూరి వీర్రాజు (నాని), బొమ్మిన రవి, రాజవరపు వెంకట్‌తో పాటు బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ కె.శివశర్మ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఈశ్వర్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు.


ఫ్లోక్స్ అప్పియరల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ భూమిపూజలో పాల్గొన్న ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఏపీఎస్ఎంసీ చైర్మన్ శివశంకర్, టీడీ జనార్దన్

మహిళలతోనే ఆర్థికాభివృద్ధి

● రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి అనుకూల వాతావరణం.
● ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): మల్లవల్లి పారిశ్రామికవాడ అభివృద్ధి ద్వారా రాష్ట్రం ఉన్నత శిఖరాలకు ఎదిగేలా కూటమి ప్రభుత్వం సహాయసహకారాలనందిస్తోందని పారిశ్రామివేత్తలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో రూ.8కోట్లకు పైగా వ్యయంతో నిర్మిస్తున్న ఫ్లోక్స్ అప్పియరల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (దుస్తులకు సంబంధించిన పరిశ్రమ) ఫ్యాక్టరీ నిర్మాణానికి బుధవారం నిర్వహించిన భూమిపూజలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఏపీఎస్ఎంసీ చైర్మన్ శివశంకర్, టీడీ జనార్ధన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ ఎక్కడ స్త్రీ గౌరవించడబడుతుందో అక్కడ అభివృద్ధికి జరుగుతుందన్నారు. ప్రపంచ జనాభాలో సగభాగంగా ఉన్న మహిళలకు సహకారం అందించగలిగితే దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రధాని మోదీ చెప్పినట్లు మహిళ సాధికారత కాకుండా మహిళలతో సాధికారతగా గుర్తించాలన్నారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్న సమయంలో రాష్ట్రాల్లోని మహిళాశక్తిని గుర్తించి సహకరించేలా కేంద్రసహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ పురందేశ్వరి సూచించారు. టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్ధన్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి సహకరించే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సింగిల్ విండో పథకం ప్రవేశపెట్టినా నెలల తరబడి తాత్సారం చేయడం కూడదన్నారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా ఏపీఐఐసీ అధికారులు సహకరించాలని సూచించారు. సమస్యలను పరిష్కరిస్తూ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి మల్లవల్లి పారిశ్రామికవాడ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోనే మేటి పారిశ్రామికవాడగా అభివృద్ధి చెందుతుందన్నారు. పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేసిన మౌలికసదుపాయాలు, లే అవుట్‌లు బాగున్నాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేలా పారిశ్రామికవేత్తలు సహకరించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. రైల్వే, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, మచిలీపట్నం పోర్టు లాంటి అన్ని రకాల రవాణా సౌకర్యాలతో కూడిన అనువైన ప్రాంతం రాష్ట్రంలో మరెక్కడా లేదని, పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే యార్లగడ్డ హామీ ఇచ్చారు. పరిశ్రమలకు భూమి పొందినవారు 18 నెలల్లో స్థాపించాలని లేదా భూములు వెనక్కు తీసుకునేలా ప్రభుత్వం పాలసీ తీసుకు వచ్చిందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి ఐదేళ్లుగా పట్టిన గ్రహణం వీడిందని, పారిశ్రామికవేత్తలు సంతోషంగా పెట్టుబడులు పెట్టవచ్చని, ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తుందని ఏపీఎస్ఎంసీ చైర్మన్ శివశంకర్ అన్నారు. అనంతరం మల్లవల్లి పారిశ్రామికవేత్తలు వారిని ఘనంగా సత్కరించారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ, ఫ్లోక్స్ అప్పియరల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు చెరుకూరి చాముండేశ్వరి, రోహిత, టీడీపీ నేతలు మూల్పూరి సాయికళ్యాణి, దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్, అక్కినేని కృష్ణాజీ, బీజేపీ నేతలు చిగురుపాటి కుమారస్వామి, తుమ్మల అంజిబాబు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు ప్రాధాన్యత

● హోంమంత్రి అనిత

ఉయ్యూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతి భద్రతలకు ప్రాధాన్యతనిచ్చి కూటమి ప్రభుత్వం పాలన చేస్తుందని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. గండిగుంట పంచాయతీ పరిధి కాటూరు రోడ్డులో కాకాని నగర్ వద్ద ఉయ్యూరు రూరల్ పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కుంటుపడిందని, నిధులున్నప్పటికీ పనులు పూర్తిచేయలేక పోయారన్నారు. రాష్ట్రంలో అన్ని పోలీస్‌స్టేషన్లకు భవనాలు నిర్మిస్తామన్నారు. నేరాలు అరికట్టేందుకు సీసీ కెమెరాలు, డ్రోన్ల వంటి అధునాతన పరికరాలతో పోలీస్ వ్యవస్థ పని చేస్తోందన్నారు. రూరల్ పోలీస్ స్టేషన్ నిర్మాణానికి 20 సెంట్ల స్థలం ఇచ్చిన దాత సజ్జా వెంకటేశ్వరరావు, సహాయం అందజేసిన వారందరూ అభినందనీయులన్నారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణలో రూరల్ స్టేషన్‌తో పాటు ఇతర ప్రభుత్వ భవనాలు పోగా 2017లో రూరల్ స్టేషన్ భవనంతో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన స్థలాన్ని సజ్జా వెంకటేశ్వరరావు విరాళంగా ఇస్తే భవనాల నిర్మాణం ప్రారంభించి 80 శాతం పైగా పూర్తిచేస్తే తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 5ఏళ్ల పాటు పనులు పూర్తిచేయకుండా నిర్లక్ష్యం చేసి వృథాగా ఉంచిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. తిరిగి కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సజ్జా వెంకటేశ్వరరావు, ఇతర దాతల సహకారంతో పనులు పూర్తిచేసి ప్రారంభించడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా దాతలకు ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అభినందనలు తెలిపారు. కంకిపాడు సీఐ మురళీకృష్ణ, ఉయ్యూరు సీఐ రామారావు, రూరల్ ఎస్సై సురేశ్‌బాబు, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.


రూరల్ స్టేషన్ నూతన భవనం ప్రారంభిస్తున్న మంత్రులు

కేసులు ఎత్తివేయాలి.. దండమూడి వినతి

వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఉద్యమం చేసిన టీడీపీ కార్యకర్తలు, తెలుగు యువత నేతలపై అక్రమంగా పెట్టిన కేసులు, రౌడీ షీట్లు ఎత్తివేయాలని జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు దండమూడి చౌదరి హోంమంత్రి అనితను కోరారు. బుధవారం ఉయ్యూరు వచ్చిన ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఉత్కంఠభరితంగా ఎడ్ల బండలాగుడు పోటీలు

నందిగామ రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాలపాడు గ్రామంలో తిరునాళ్ల మహోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఎడ్ల బండలాగుడు పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. బుధవారం ఆరు పళ్ల జతల ఎడ్ల బండ లాగుడు పోటీలను లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త చిరుమామిళ్ల వెంకటలక్ష్మీ సాయిబాబు ప్రారంభించారు. ఈ పోటీల్లో 17 జతలు పాల్గొనగా 15 నిమిషాల వ్యవధిలో 10.20 క్వింటాళ్ల బండ లాగినట్టు రైతు కమిటీ సభ్యులు తెలిపారు. ఎడ్ల యజమానులకు అంబారుపేట సత్యమ్మ అమ్మవారి మాజీ చైర్మన్ గరికపాటి భాస్కరం సోదరులు వస్త్రాలు, జ్ఞాపికలు అందజేశారు. పోటీలను తిలకించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



నాలుగు పళ్ల విభాగం విజేతలు

మంగళవారం రాత్రి జరిగిన 4 పళ్ల జతల విభాగంలో గుంటూరు జిల్లా కొల్లిపర గ్రామానికి చెందిన గుదిబండ మాధవరెడ్డి శ్రీనివాస రెడ్డి ఎడ్ల జత 4,750 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ.30 వేలు గెలుచుకుందన్నారు. అలాగే బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన వజ్రాల తేజరెడ్డి, కృష్ణాజిల్లా పెనమలూరుకు చెందిన అనంతనేని శ్రీకన్యశ్రీ మధు ఎడ్ల జత 4,702 అడుగులు లాగి ద్వితీయ స్థానంలో నిలిచి రూ.25వేలు, బాపట్ల జిల్లా యద్దనపూడికి చెందిన ఖాదర్ మస్తాన్, బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పూసపాడుకు చెందిన ఏలూరి లిఖిత చౌదరి ఎడ్ల జత 3,750 అడుగుల దూరం లాగి తృతీయ స్థానంలో నిలిచి రూ.20వేలను గెలుచుకుందన్నారు. చందర్లపాడు గ్రామానికి చెందిన గడుపూడి సాంబశివరావు ఎడ్లజత 3,500 అడుగుల దూరం లాగి 4వ స్థానంలో నిలిచి రూ.18 వేలను గెలుచుకున్నాయి. వెంకటేశ్వరరావు, విక్రం, రాంబాబు, వెంకట్రావ్, గంటా శివాజీ, మదుసూదనరావు, దాతల సహకారంతో బహుమతులు అందజేశారు.

గన్నవరంలో ఊపందుకున్న అభివృద్ధి పనులు

● జాతీయ రహదారి సుందరీకరణ పనులు వేగవంతం చేయండి ● అధికారులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాలు

విజయవాడ, మే 14 (ఆంధ్రజ్యోతి): గన్నవరం ముఖచిత్రాన్ని మార్చే జాతీయ రహదారి డివైడర్లు, ఫుట్‌పాత్‌ల సుందరీకరణ పనులను మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గన్నవరం విమానాశ్రయం అమరావతికి ప్రధాన ద్వారమన్నారు. ఇది రాష్ట్రానికి వచ్చే పారిశ్రామికవేత్తలు, విదేశీ అతిథులు నగరానికి వచ్చినప్పుడు మొదటగా చూసే ప్రాంతమని, దీన్ని మరింత అందంగా, శుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. డివైడర్లపై మొక్కలు లేని చోట్ల తక్షణమే మొక్కలు నాటాలన్నారు. ఫుట్‌పాత్‌లపై ఆకర్షణీయమైన కుండీలు ఏర్పాటు చేసి అందులో హరిత ముసుగు ఏర్పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డివైడర్లపై సృజనాత్మక రంగులతో కూడిన చిత్రలేఖనాలతో అందంగా తీర్చిదిద్దాలన్నారు. డీపీవో, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు, ఇతర శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

● 16 నుంచి 25 వరకు నడుపుతాం : ప్రజారవాణా అధికారి ఎం.వై.దానం

విజయవాడ, మే 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15 నుంచి 26 వరకు జరిగే సరస్వతి పుష్కరాలను పురస్కరించుకుని కాళేశ్వరం త్రివేణి సంగమ యాత్రకు నగరంలోని పండిట్ నెహ్రూ బస్టేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా ప్రజారవాణా అధికారి ఎంవై దానం తెలిపారు. దీనికోసం సూపర్ లగ్జరీ, ఇంద్ర ఏసీ బస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులు ఈనెల 16 నుంచి 25 వరకు ప్రతిరోజూ అందుబాటులో ఉంటాయన్నారు. ఇక్కడ బయలుదేరిన బస్సులు మూడు రోజులు తెలంగాణలోని వివిధ పుణ్యక్షేత్రాల అనంతరం 4వ రోజు ఉదయం నగరానికి చేరుకుంటాయన్నారు. విజయవాడ నుంచి ఖమ్మం, వరంగల్, భూపాలపల్లి మీదగా కాళేశ్వరం వెళతాయన్నారు. పుష్కరస్నానం, ముక్తేశ్వరస్వామి దర్శనానంతరం ధర్మపురిలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి, కొండగట్టు వీరాంజనేయ స్వామి, వేములవాడ శ్రీ రాజరాజేశ్వరి దేవి, మహాశివుని దర్శనానంతరం రెండోరోజు బస్సు వేములవాడలో ఆగుతుందన్నారు. 3వ రోజు ఉదయం వరంగల్ భద్రకాళిమాత, వేయిస్తంభాల గుడి, రామప్ప దేవాలయం, రామప్ప సరస్సు దర్శనం తరువాత 4వ రోజు నగరానికి తిరిగొస్తుంది. పుష్కరయాత్రకు వెళ్లాలనుకునేవారు ఆన్‌లైన్ (ఏపీఎస్‌ఆర్టీసీఆన్‌లైన్.ఇన్) లేదా దగ్గర్లోని బస్టేషన్, ఆర్టీసీ బుకింగ్ ఏజెంట్ల ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు. ఒకవేళ యాత్రకు సమూహంగా (కనీసం 30 మంది) వెళ్లాలనుకుంటే ఇంటి నుంచే బస్సు ఏర్పాటు చేస్తామని ఎం.వై.దానం వెల్లడించారు. సూపర్‌లగ్జరీకి ఒక్కొక్కరి రూ.1999, ఇంద్ర ఏసీకి రూ.2599గా ధరలు నిర్ణయించారు. వివరాలకు 80742 98487, 93903 98475 నంబర్లను సంప్రదించాలన్నారు.

70 ఏళ్ల పాఠశాలకు హైస్కూల్ భాగ్యం లేదా..!

● అప్పర్ ప్రైమరీగానే పీ నైనవరం స్కూల్
● అర్హతలన్నీ ఉన్నా పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
● హైస్కూల్‌కు వెళ్లాలంటే 5 కిలోమీటర్లు వెళ్లాల్సిందే
● దూరాభారాలు మోయలేక చదువు ఆపేస్తున్న విద్యార్థులు

విజయవాడ రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): 1955లో స్థాపితమైన విజయవాడ రూరల్ మండలం పీ నైనవరం గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాల, 2025 నాటికి 70 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. అయినప్పటికీ, ఈ పాఠశాల హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ కాకపోవడం గ్రామ విద్యార్థులకు పెను సవాల్‌గా మారింది.


పీ నైనవరంలోని మండల పరిషత్ పాఠశాల

అన్ని అర్హతలు ఉన్నా..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం హైస్కూల్ గుర్తింపు కోసం అవసరమైన అన్ని అర్హతలు అంటే 40-45 మంది విద్యార్థులు, 5 కి.మీ. పరిధిలో ఇతర హైస్కూల్ లేకపోవడం ఈ పాఠశాలకు ఉన్నాయి. ఈ ఏడాది 52 మంది విద్యార్థులు అప్పర్ ప్రైమరీ విద్యను పూర్తి చేశారు. సమీపంలో 2 కి.మీ. దూరంలో ఎలాంటి ప్రభుత్వ హైస్కూల్ లేదు. అయినా, అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల ఈ పాఠశాల అప్పర్ ప్రైమరీ స్థాయిలోనే కొనసాగుతోంది. దీంతో విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

దూరాభారంతో చదువులకు స్వస్తి

ఈ పాఠశాలలో చదివే విద్యార్థులు ఎక్కువగా నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన వారు. వారికి ఖర్చుతో కూడిన ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే ఆర్థిక స్తోమత లేదు. హైస్కూల్ చదువుల కోసం సమీపంలోని గ్రామాల్లోని పాఠశాలలకు వెళ్లాలన్నా, అవి 5 కి.మీ. దూరంలో ఉన్నాయి. నున్న లేదా జక్కంపూడి కాలనీకి వెళ్లాలంటే, రవాణా సౌకర్యం లేని గ్రామీణ మార్గాల గుండా సైకిళ్లపై లేదా నడిచి వెళ్లాల్సి ఉంటుంది. బస్సులు లేదా ఆటోలు దొరకటం కాస్త కష్టంగానే ఉంటుంది. దీంతో విద్యార్థులు రెండు, మూడు గ్రామాలను దాటుకుని పాఠశాలకు చేరుకోవాల్సిన దుస్థితి. టీ కారణాల వల్ల చాలామంది విద్యార్థులు చదువును మధ్యలోనే వదిలేస్తున్నారు. ముఖ్యంగా బాలికలు తీవ్రంగా నష్టపోతున్నారు. చదువు కొనసాగించలేక, కొంతమంది విద్యార్థినులు తల్లిదండ్రులకు సహాయంగా పొలం పనులకు వెళ్తుండగా, గతంలో బాల్య వివాహాలు కూడా జరిగిన సందర్భాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ పరిస్థితి గ్రామంలో విద్యా వ్యవస్థను దెబ్బతీస్తూ, యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తోంది. పీ నైనవరం పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఇది విద్యార్థులకు స్థానికంగానే నాణ్యమైన విద్యను అందించడమే కాక, బాలికల విద్యను ప్రోత్సహించి, బాల్య వివాహాల వంటి సామాజిక సమస్యలను నివారిస్తుంది. అంతేకాక, సమీప గ్రామాలకు రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా విద్యార్థుల భద్రతకు హామీ ఇవ్వొచ్చు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ సమస్యపై తక్షణం స్పందించి, పీ నైనవరం పాఠశాలకు హైస్కూల్ హోదా గుర్తింపు కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ చిన్న చర్య గ్రామ విద్యార్థుల జీవితాలను మార్చి, వారి భవిష్యత్తును ప్రకాశవంతం చేస్తుంది.

పాలిసెట్ ఫలితాల్లో అమ్మాయిలదే పైచేయి

ఎన్టీఆర్ జిల్లాకు 6, కృష్ణాకు 15వ ర్యాంక్

బెంజిసర్కిల్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లా పాలిసెట్ ఫలితాల్లో అమ్మాయిలే పై చేయి సాధించారు. మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ బుధవారం పాలిసెట్-2025 ఫలితాలను విడుదల చేయగా ఎన్టీఆర్ జిల్లా 6వ ర్యాంక్, కృష్ణాజిల్లా 15వ ర్యాంక్ సాధించింది. ఈ ప్రవేశ పరీక్షకు ఎన్టీఆర్ జిల్లా నుంచి 6,761 మంది హాజరుకాగా 6,532 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 4,124 మంది, బాలికలు 2,637 మంది హాజరుకాగా వీరిలో బాలురు 3,967 మంది, 2,565 మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారు. బాలురు 96.19 శాతం, బాలికలు 97.27 శాతం ఉత్తీర్ణత శాతం సాధించారు. మొత్తం బాలబాలికలు కలిపి ఎన్టీఆర్ జిల్లాలో 96.61 శాతం ఉత్తీర్ణులయ్యారు. కృష్ణాజిల్లాలో 4,083 మంది బాలబాలికలు పరీక్షకు హాజరుకాగా 3,882 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 2,425 మంది పరీక్షకు హాజరుకాగా 2,269 మంది, బాలికలు 1,658 మంది పరీక్షకు హాజరుకాగా వారిలో 1613 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 97.29 శాతం, బాలురు 93.57 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 95.08 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.

ర్యాంకర్‌లు వీరే..

ఎన్టీఆర్ జిల్లా నుంచి షేక్ ముబీన్ 49వ ర్యాంక్, వేములకొండ ధీమంత్ 64వ ర్యాంక్, చోరగుడి శశి మంజూష 93వ ర్యాంక్ సాధించారు. కృష్ణాజిల్లాలో ఉత్సా జోషిత 331వ ర్యాంక్, నల్లా హర్షిత శేషసాయి 498వ ర్యాంక్, కడవకొల్లు హేమ వరుణ్ చతుర్వేది 520 ర్యాంక్ సాధించారు. అలాగే వీవి జోషిత 116 మార్కులు, ఎస్ హర్షిత శేషసాయి, కే హేమవరుణ్ చతుర్వేది 115 మార్కులు సాధించి కృష్ణాజిల్లాలో తొలి మూడు స్థానాల్లో నిలిచారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

నాగాయలంక, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో ఎ.సంజీవ్‌కుమార్ తెలిపారు. ఈ ఖరీఫ్‌లో 30 క్వింటాళ్ల జీలుగ, 150 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు కోసం ఏపీ సీడ్స్‌కు ఇండెంట్ పెట్టగా, ప్రస్తుతం 50 క్వింటాళ్ల పిల్లి పెసర విత్తనాలు వచ్చాయని తెలిపారు. మండలంలోని రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీకి వాటిని సిద్ధంగా ఉంచామని పేర్కొన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, భూమి వివరాలతో రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించాలని ఏవో సూచించారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

● ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

చల్లపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగం తర్వాత పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశుపోషకులకు 50శాతం సబ్సిడీపై సమీకృత దాణా పంపిణీని బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ప్రారంభించారు. భారత్ పశుధన్‌యాప్‌లో నమోదై, తెల్ల రేషన్‌కార్డు ఉన్న పశుపోషకులకు మాత్రమే సబ్సిడీపై ఈ దాణా లభిస్తుందని చల్లపల్లి సబ్‌డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకట భార్గవ తెలిపారు. 50 కిలోల దాణా రూ.1,110 కాగా, సబ్సిడీపై రూ.555కు అందిస్తున్నట్లు తెలిపారు. మండలంలో జనరల్ కేటగిరీకి 10 వేల కిలోలు, ఎస్సీ కేటగిరీకి 6,300 కిలోలు, మోపిదేవి మండలంలో జనరల్ కేటగిరీకి 9వేల కిలోలు, ఎస్సీ కేటగిరీకి 6450 కిలోలు కేటాయించినట్లు ఆయన వివరించారు. పశువైద్యాధికారి పి.మనోజ్‌కుమార్, ఎంపీపీ కోట విజయ రాధిక, మోర్ల రాంబాబు, మాలెంపాటి శ్రీనివాసరావు, షేక్ నబీషేూరి, సజ్జా చలపతిరావు, డాక్టర్ నందకిషోర్ పాల్గొన్నారు.


పశుపోషకులకు దాణాను అందిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

బంటుమిల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులకు కల్టివేటర్లు, పవర్ స్ప్రేయర్లు, పశువుల దాణాను సబ్సిడీపై ఆయన పంపిణీ చేశారు. సీజన్‌కు ముందుగానే అవసరమైన విత్తనాలను దిగుమతి చేసి, అవసరమైన వారికి అందజేయాలని అధికారులకు ఆయన సూచించారు. రైతులు అధిక ధరలతో బయట కొన్నాక, విత్తనాలు అందివడం సరికాదన్నారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు సంబంధించి రూ.30,10,530 విలువైన 62 కల్టివేటర్లను, రూ.6,20,670 విలువైన 31 పవర్ స్ప్రేయర్లను అందజేశారు. పాడి రైతులకు 50 సబ్సిడీపై పశువుల దాణా అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు, బొర్రా కాశీ, ఒడుగు తులసీరావు, కూనసాని చిన్నా, వ్యవసాయశాఖ ఏడీఏ గౌతమ్, ఏవో శివరామకృష్ణ, జెన్నీ, పశువైద్యురాలు స్ఫూర్తి పాల్గొన్నారు.



రైతులకు పశువుల దాణా అందిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పశువుల దాణా అందజేత

గూడూరు: గూడూరు పశువుల ఆస్పత్రిలో 50 శాతం రాయితీపై ప్రభుత్వం అందించిన పశువులదాణాను పాడి రైతులకు డీసీ చైర్మన్, టీడీపీ మండల అధ్యక్షుడు పోతన స్వామి అందజేశారు. పశుసంవర్ధక శాఖ ఏడీ కె.బాబూరావు, సర్పంచ్ లింగం సులోచనారాణి, కూటమి నాయకులు దాసరి ఉమాసాయిరాం, ఎస్‌ఏ బేగ్, పోతన రామోజీ, గోపీ నాగబాబు, బాసంశెట్టి విజయ్, డాక్టర్ విజయకుమార్, పాడిరైతులు పాల్గొన్నారు.

విద్యుత్ కోత..అల్లాడిన ప్రజలు

నాగాయలంక, మే 14 (ఆంధ్రజ్యోతి): అసలే వేసవి..ఆ పైన అడపాదడపా విద్యుత్ కోత విధించడంతో బుధవారం గృహ వినియోగదారులు, కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు ఉక్కపోతతో అల్లాడిపోయారు. నాగాయలంక గ్రంథాలయంలో కరెంట్ కోతతో పై ఫ్యాన్లు తిరగకపోవటంతో పాఠకులు అవస్థలు పడ్డారు. ఇక కార్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.

బస్ షెల్టర్ ప్రారంభం

ఘంటసాల, మే 14 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం కరకట్టపై కొండవీటి పాండురంగారావు-సీతారావమ్మ జ్ఞాపకార్థం సుగ్గన సురేంద్ర-మాధవి దంపతులు సమకూర్చిన రూ.3 లక్షలతో నిర్మించిన బస్ షెల్టర్‌ను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. తూర్పుకృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, మండలి వెంకట్రామ్, తాడికొండ వెంకటేశ్వరరావు(చిన్నా), ముప్పనేని రవిప్రసాద్, గాజుల నాగ శ్రీనివాసరావు, సుగ్గన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా..18 మందికి స్వల్ప గాయాలు

గూడూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారిపై తరకటూరుపాలెం వద్ద బుధవారం ఆటో బోల్తా కొట్టిన సంఘటనలో 18 మందికి స్వల్పగాయాలయ్యాయి. ఎస్సై కె.ఎన్.వి.సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లికి చెందిన కొందరు మచిలీపట్నంలో ఓ కార్యక్రమానికి మూడు ఆటోల్లో బయలుదేరారు. గన్నవరం వచ్చేసరికి ఒక ఆటో పాడయిపోవడంతో అందులోని ప్రయాణికులు ప్రమాదం జరిగిన ఆటోలో ఎక్కారు. ఆ ఆటో తరకటూరుపాలెం వద్దకు వచ్చేసరికి హ్యాండిల్‌కు ఆటోలోని ఓ వ్యక్తి కాలు తగిలింది. దీంతో హ్యాండిల్ తిరగక ఆటో పక్కకు బోల్తా కొట్టింది. ఆటోలో 9 మంది పెద్దలు, 9 మంది పిల్లలు ఉన్నారు. డ్రైవర్ ఎల్.శివరామప్రసాద్, కోటేశ్వరరావు, వెంకటేశ్వరమ్మ, బ్లెస్సి, శిరీష, చైతన్య, సుజాత, గణేష్, బేబీ, వెంకటేశ్వరరావు, హర్షిత, హనుమంతరావు, రోశమ్మ, హరిచందన, కుమారి, ఆద్య, వంశీ, చైతన్యకు గాయాలయ్యాయి. ఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


తరకటూరుపాలెం వద్ద బోల్తా కొట్టిన ఆటో

సైనికులకు సంఘీభావంగా తిరంగా ర్యాలీ

మోపిదేవి, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం దేశానికి గర్వకారణమని ఎంపీపీ రావి దుర్గావాణి అన్నారు. సైనికులకు సంఘీభావంగా మండల పరిషత్, వివిధ ప్రభుత్వశాఖల ఆధ్వర్యంలో భారీ జాతీయ పతాకంతో తిరంగా ర్యాలీని బుధవారం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి జాతీయ రహదారి అక్కడి నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. ప్రధాన కూడలి వద్ద అమరులకు నివాళులర్పించారు. జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, మండలి వెంకట్రామ్, నడకుదుటి జనార్ధనరావు, రావి నాగేశ్వరరావు, రావి రత్నగిరి, కోట సాయికృష్ణ, కడవకొల్లు సీతారామాంజనేయులు పాల్గొన్నారు.


మోపిదేవి ప్రధాన కూడలిలో భారీ జాతీయ జెండాతో నిర్వహిస్తున్న ర్యాలీ

ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావుకు సత్కారం

అవనిగడ్డ, మే 14 (ఆంధ్రజ్యోతి): దివి మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమితులైన కొల్లూరి వెంకటేశ్వరరావును నియోజకవర్గ దళిత నేతలు బుధవారం సత్కరించారు. టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం మోపిదేవి మండలం కప్తానుపాలేనికి చెందిన దళిత నాయకుడు డోకిపర్తి బాలకోటేశ్వరరావు, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణ, మేడికొండ విజయ్, చాట్రగడ్డ భరత్, కొల్లూరి వాసు పాల్గొన్నారు.


కొల్లూరి వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న దళిత నేతలు

టీడీపీ వెంకటాపురం గ్రామ కమిటీ ఏకగ్రీవం

మోపిదేవి, మే 14 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లలో పార్టీ కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడ నడకుదుటి జనార్దనరావు భరోసానిచ్చారు. బుధవారం మోపిదేవిలో టీడీపీ మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకటాపురం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గొరిపర్తి వేణుగోపాలకృష్ణ, ఉపాధ్యక్షులుగా అబ్బూరి జ్ఞాన సుందరరావు, కార్యదర్శిగా పాముల శ్రీనివాసరావును ఎన్నుకున్నట్లు కమిటీ సమావేశంలో తెలిపారు. ఎంపీపీ రావి దుర్గావాణి, జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


మండల నాయకులకు తీర్మాన పత్రం అందిస్తున్న వెంకటాపురం గ్రామ కమిటీ సభ్యులు

టీడీపీ శ్రేణుల ఘర్షణ

పెదప్రోలు పంచాయతీ పరిధిలో సభ్యత్వ గుర్తింపు కార్డుల పంపిణీ వ్యవహారం టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణకు దారితీసింది. పంచాయతీ పరిధిలోని కప్తానుపాలెంలో సభ్యత్వ నమోదు జరిపించిన వ్యక్తిని వదిలేసి, వేరే వ్యక్తులు వచ్చి కార్డులు ఎందుకు పంపిణీ చేస్తున్నారని మండల నాయకులను డోకిపర్తి బాలకోటేశ్వరరావు అడిగారు. కార్డుల పంపిణీ మాకు నచ్చినట్లు చేస్తాం మీకు చెప్పాలా? అంటూ ఆర్.సాంబశివరావు, మరి కొంతమంది బదులివ్వడంతో వారి మధ్య ఘర్షణకు దారి తీసింది. మండల నాయకులు జోక్యం చేసుకుని ప్రతి బూత్‌లోనూ, గ్రామంలోనూ పార్టీ కోసం కష్టపడుతున్న వారికి సమాచారం ఇచ్చి పంపిణీ చేస్తే బాగుంటుంది అలా ఎందుకు చేయరని అడుగగా..మరింత ఘర్షణ రేగింది. కొద్దిసేపు తీవ్ర ఘర్షణ జరుగగా, సమావేశానికి విచ్చేసిన నేతలు ఇరువర్గాల వారికి సర్ది చెప్పారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం
జనసేన టీచర్స్ ఫెడరేషన్ కృషి

మచిలీపట్నం టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అండదండలతో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి జనసేన టీచర్స్ ఫెడరేషన్ కృషి చేస్తుందని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అప్పినేడి వెంకట రామాంజనేయులు(రాము) తెలిపారు. బుధవారం మంగళగిరి జనసేన రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ ప్రోగ్రామింగ్ కమిటీ రాష్ట్ర చైర్మన్ కల్యాణం శ్రీనివాస్(కేకే)ను తనతోపాటు ఉపాధ్యాయ ఫెడరేషన్ మహిళావిభాగం నాయకురాలు విజయశ్రీ, లక్ష్మీనాంచారమ్మ, కాత్యాయినితో కలిశారని ఆయన తెలిపారు. త్వరలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలసి ఫెడరేషన్ కార్యక్రమాలను వివరిస్తామన్నారు. మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బండ్రెడ్డి రామకృష్ణను కలిసి ఫెడరేషన్ కార్యకలాపాలను ఎలా నిర్వహించబోతున్నది వివరించారు.


జనసేన ప్రోగ్రామింగ్ కమిటీ చైర్మన్ కల్యాణం శ్రీనివాస్‌తో ఫెడరేషన్ నాయకులు

కూటమి ప్రభుత్వంలో రహదారులకు మహర్దశ

కోడూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రహదారులకు మహర్దశ వచ్చిందని జనసేన మండల అధ్యక్షుడు మర్రె గంగయ్య అన్నారు. కోడూరు 9వ వార్డు నుంచి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వరకు రూ.24 లక్షలతో నిర్మిస్తున్న 333 మీటర్ల సీసీ రహదారి పనులను బుధవారం జనసేన నేతలతో కలిసి ఆయన పరిశీలించారు. రూ.24 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో ఈ రహదారి నిర్మిస్తున్నట్టు ఆయన తెలిపారు. లంకే యుగంధర్‌రావు, కొండవీటి సునీత, కోట రాంబాబు, బడే భావన్నారాయణ, సిద్ధినేని అశోక్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


రహదారి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జనసేన నేతలు



ముగిసిన వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలు

మోపిదేవి, మే 14 (ఆంధ్రజ్యోతి): కొత్తపాలెంలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలు బుధవారం స్వామివారి పవళింపు సేవా కార్యక్రమంతో ముగిశాయి. మహోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామికి కృష్ణానదిలో చక్రస్నానం గావించారు. విశేష అలంకరణలు చేసి స్వామి, అమ్మవార్లను ఊయలపై ఆశీనులను గావించి పవళింపు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకుడు పులిపాక మూర్తి, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


వేణుగోపాలస్వామికి పవళింపుసేవ నిర్వహిస్తున్న భక్తులు

వేకనూరులో అంకాలమ్మ ఉత్సవాలు

అవనిగడ్డ రూరల్: వేకనూరులో మాదివాడ వారి ఇలవేల్పు అంకాలమ్మ జాతర మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. నిర్వాహకుడు మాదివాడ శ్రీనివాస పెరుమాళ్ల ఆధ్వర్యంలో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారికి భారీ కుంభాభిషేకం నిర్వహించారు. పలువురు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పూర్ణాహుతితో ముగిసిన బ్రహ్మోత్సవాలు

అవనిగడ్డ: లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం పూర్ణాహుతితో ముగిశాయి. ఆగమ పండితుడు దీవి పార్థ వెంకటరామశ్రీనివాసాచార్యులు బ్రహ్మత్వంలో నిత్యహోమం, మౌన బలి కార్యక్రమాలు నిర్వహించి కల్యాణకర్తలు పోతరాజు పవన్‌కుమార్-సుమిత్ర దంపతులతో పూర్ణాహుతిని నిర్వహించారు. అనంతరం ధ్వజావరోహణం, బృహస్పతి పూజ, కంకణ విసర్జన, ఆచార్య సంభావన, మహాదాశీర్వచనం నిర్వహించారు. ధర్మకర్త పోతరాజు భాస్కరరావు, ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

మతతత్వ, కార్పొరేట్ శక్తుల
సమ్మిళితమే నయాఫాసిజం

మచిలీపట్నం టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : మతతత్వ, కార్పొరేట్ శక్తుల సమ్మిళితమే నయాఫాసిజంగా అవతరిస్తోందని మార్క్సిస్టు సైద్ధాంతిక మాసపత్రిక ఎడిటర్ ఎస్.వెంకట్రావు అన్నారు. ఫాసిజంపై సోషలిస్టు సోవియేట్ రష్యా విజయం సాధించిన సందర్భంగా బుధవారం బుట్టాయిపేటలో మహాత్మాజ్యోతీరావుఫూలే విజ్ఞాన కేంద్రంలో ఫాసిజంపై నాడు-నేడు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య వక్తగా మాట్లాడారు. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యాలకు వ్యతిరేకంగా జర్మనీ, జపాన్, ఇటలీ దేశాలు ఆధిపత్యం కోసం రెండో ప్రపంచ యుద్ధానికి పూనుకున్నాయన్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో దేశ వ్యాప్తంగా 5 కోట్ల మంది చనిపోతే అందులో 2 కోట్ల మంది యువకులు ఉన్నారన్నారు. జర్మనీ, జపాన్, ఇటలీ దేశాలు, ఐరోపా, ఆఫ్రికా, ఆసియా ఖండాలను ఆక్రమించి ఆధిపత్యం కోసం పోరాడినప్పుడు సోవియెట్ యూనియన్, రెడ్ ఆర్మీ కొన్ని నెలలపాటు పోరాడాయని, నాజీల్ ముందుకు చొచ్చుకురావడాన్ని అడ్డుకోవడంతో నాజీల పతనం మొదలైందని తెలిపారు. అమెరికాలో ట్రంప్ గెలుపు వెనుక తెల్లజాతి ప్రజల ఆధిపత్యం ఉందన్నారు. అమెరికాతో పాటు ఇటలీ, ఫ్రాన్స్ దేశాల్లో ఫాసిజం పార్టీలు అధికారంలోకి వచ్చాయన్నారు. భిన్నత్వంలో ఏకత్వం అంటూనే 15 శాతం ఉన్న ముస్లింల మీద 80 శాతం హిందువులను ఉసి గొల్పుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు


మాట్లాడుతున్న రచయిత ఎస్. వెంకట్రావు

టీడీపీ నేత కుటుంబానికి
ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పరామర్శ

చల్లపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన టీడీపీ నేత రావి వేణుగోపాలకృష్ణ(వేణు) కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ బుధవారం పరామర్శించారు. బాలాజీ అపార్ట్‌మెంట్‌లోని స్వగృహానికి వెళ్లి వేణు చిత్రపటానికి నివాళులు అర్పించారు. వేణు బావ, న్యాయవాది యలమంచిలి సుబ్బారావును పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల అధ్యక్షుడు మోర్ల రాంబాబు, ఎంపీపీ కోట విజయరాధిక, ఎంపీటీసీ మాలెంపాటి శ్రీనివాసరావు, టీడీపీ నేతలు సజ్జా చలపతిరావు, షేక్ నబీషేూరి, గొరైపాటి పిచ్చేశ్వరరావు, బత్తుల ప్రసాద్, రావి రాజు, జనసేన నేత బొందలపాటి వీరబాబు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి

మచిలీపట్నం టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకను వెలికితీసేందుకు వేసవి శిక్షణ తరగతులు దోహదపడతాయని, గ్రంథ పఠనం ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని మునిసిపల్ కమిషనర్ బాపిరాజు సూచించారు. ఈడేపల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థుల వేసవి శిక్షణ తరగతులను బుధవారం ఆయన సందర్శించారు. ఈడేపల్లి శాఖ గ్రంథాలయ అధికారి కోన వెంకటేశ్వరమ్మ, స్థానిక నాయకుడు పీవీ ఫణికుమార్ పాల్గొన్నారు. బాపిరాజును ఫణికుమార్ సత్కరించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో రాత చక్కగా రాయడంపై అప్పినేడి పోతురాజు శిక్షణ ఇచ్చారు. నగేష్, విజయలక్ష్మి పాల్గొన్నారు.


వేసవి శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ బాపిరాజు

సీబీఎస్ఈ 'పది' ఫలితాలు..
కేంద్రీయ విద్యాలయంలో నూరుశాతం ఉత్తీర్ణత

మచిలీపట్నం టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మచిలీపట్నం పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ అహమ్మద్ ఆసీఫ్ హుస్సేన్ తెలిపారు. 61 మంది పరీక్షలు రాయగా 61 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. కొసనం రిహిత (555), కుంపటి హిమవర్షిణి(534), రాయిషా సుల్తానా(529) మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని ఆయన తెలిపారు. 500 మార్కులకు పైగా ఆరుగురు విద్యార్థులు సాధించారన్నారు.


కె.రిహిత (555) హిమవర్షిణి (534) రాయిషా సుల్తానా(529)

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

చల్లపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): లేబర్‌కోడ్‌ల రద్దు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, పంచాయతీ కార్మికులకు రూ.21వేల జీతం, టెండర్ల రద్దు డిమాండ్‌తో ఈ నెల 20వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి బుధవారం సమ్మె కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులతో సమావేశాలు నిర్వహించి సమ్మె ఆవశ్యకతను తెలియజేశారు. చల్లపల్లి, లక్ష్మీపురం పంచాయతీ కార్యదర్శులు పీవీ మాధవేంద్రరావు, ఉమామహేశ్వరరావులకు కార్మికులతో కలిసి 20వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సమ్మె నోటీసును అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు కనగాల ప్రసాద్, జయలక్ష్మి, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.


చల్లపల్లి పంచాయతీ కార్యదర్శి పీవీ మాధవేంద్రరావుకు నోటీసు అందిస్తున్న సీఐటీయూ మండల కార్యదర్శి కరీముల్లా, కార్మికులు

కొండాలమ్మను దర్శించుకున్న ప్రముఖులు

గుడ్లవల్లేరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారిని రాష్ట్ర ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్ర, యలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ (జనసేన)లు బుధవారం దర్శించుకొన్నారు. వీరికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం వారిని సత్కరించి వేదాశీర్వాదం చేశారు. అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.



అమ్మవారి చిత్రపటాన్ని మంత్రి, ఎమ్మెల్యేలకు అందజేస్తున్న అర్చకుడు



క్రిమిటోర్ పనితీరును పరిశీలిస్తున్న మనోహర్

క్రిమిటోర్‌లు ఏర్పాటు చేస్తాం

● మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్

గుడివాడ, మే 14(ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం ఆధ్వర్యంలో క్రిమిటోర్‌లను ఏర్పాటు చేస్తామని, నూతన పరికరాలతో ప్రజలకు ఖర్చు తగ్గుతుందని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ పేర్కొన్నారు. స్థానిక రోటరీ వైకుంఠ ప్రస్థానంలో రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్యాస్ సంబంధిత పోర్టబుల్ క్రిమిటోర్ సిస్టంలను బుధవారం ఆయన ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు టి.ఎస్. రాజశేఖర్, కార్యదర్శి కిరణ్‌బాబు, కౌన్సిలర్ జి.బాబుశ్రీకర్, కమ్యూనిటీ సర్వీస్ ట్రస్ట్ కార్యదర్శి రామకృష్ణ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ముమ్మరం

పామర్రు : పామర్రులో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో కాటూరి సురేష్ పేర్కొన్నారు. బుధవారం నిమ్మలూరులో కొనసాగుతున్న పంచాయతీ చెరువుతవ్వకాల పనులతోపాటు, రిమ్మనపూడిలో జరుగుతున్న పంటబోదెల తవ్వకాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 135 పంట బోదెల తవ్వకాలకు 172 స్వయం శక్తి సంఘాల నుంచి 2932 మంది కూలీలు పనుల్లో ఉపాధి పొందుతున్నారన్నారు. వీరికి అవసరమైన తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

సీనియర్ టీడీపీ నేత భార్య మృతి

నందివాడ : నందివాడ గ్రామ సీనియర్ నాయకుడు అడుసుమిల్లి దుర్గా ప్రసాద్ (మాజీ బ్యాంక్ అధ్యక్షుడు) భార్య అడుసుమిల్లి విజయలక్ష్మి బుధవారం తన స్వగృహంలో అనారోగ్యంతో తుది శ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు బాధిత కుటుంబాన్ని నందివాడలోని మృతురాలి స్వగృహం వద్ద పరామర్శించారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పసరు నీరు తాగేదెలా..!

● కాలుష్య కోరల్లో చిక్కుకున్న మంచినీటి చెరువు ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - పెదపారుపూడి): మోపర్రులో పాలకుల నిర్లక్ష్యంతో గ్రామస్థులకు తాగునీటి కష్టాలు తప్పటం లేదు. గ్రామపంచాయతీ తాగునీటి చెరువు 10 ఎకరాల్లో విస్తరించి ఉన్నప్పటికీ ఫిల్టర్ బెడ్‌లు పని చేయటం లేదు. దీనికితోడు మంచినీటి చెరువు నాచు, ఇతర వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో పంచాయతీ సిబ్బంది చెరువునీటిని ఫిల్టర్ చేయకుండానే కుళాయిలకు సరఫరా చేస్తున్నారు. కుళాయిల ద్వారా వచ్చే కలుషితమైన నీరు పసరురంగుతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. ఈ నీరు కనీసం పశువులు తాగేందుకు సైతం ఉపయోగపడటం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. పాడైపోయిన ఫిల్టర్ బెడ్‌లను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి. తాగునీటి సరఫరాలో ఉన్న అవరోధాలు తొలగించి, వాటర్ హెడ్ ట్యాంకుల ద్వారా అయినా ఫిల్టర్ చేసి తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



నాచు, ఇతర వ్యర్థాలతో నిండిన మంచినీటి చెరువు



పాడైపోయిన ఫిల్టర్ బెడ్

వాటర్ ఫిల్టర్ బెడ్ పాడైపోయింది



వైసీపీ హయాంలో మంచినీటి సమస్య గురించి ప్రజాప్రతినిధులకు తెలియజేశాం. సమస్యను పరిష్కరించేందుకు అంచనాలు వేస్తున్నామని కాలయాపన చేశారు. కూటమి ప్రభుత్వంలో ఫిల్టర్ బెడ్ మరమ్మతులు చేయించి తాగునీటిని అందించాలి.

జూపల్లి రాజేష్, గ్రామస్థుడు

అధికారులు పట్టించుకోవడం లేదు



తాగునీటి చెరువులోనే నాచు ఇతర వ్యర్థాలను తొలగించాలి. ఈ విషయమై పంచాయతీ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునేనాథుడే కరువాయ్యాడు.

బోయిన సాంబశివరావు

మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

గుడివాడ, మే 14 (ఆంధ్రజ్యోతి) : మెగా జాబ్ మేళాను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి డి.విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.నరేష్‌కుమార్‌లు తెలిపారు. స్థానిక ఏఎన్‌ఆర్ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి , శిక్షణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాలో 475మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, వారిలో 257మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామకపత్రాలను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్. కుమార్, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ప్లేస్మెంట్ అధికారి మధు, కళాశాల ప్లేస్మెంట్ అధికారి వి.నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి వాటర్ ఫిల్టర్ వితరణ

కూచిపూడి : మొవ్వ శాఖ గ్రంథాలయానికి లక్ష్మీ తులసీ జ్ఞాపకార్థం గౌతమ్, దేష్ణలు బుధవారం వాటర్ ఫిల్టర్‌ను గ్రంథాలయాధికారిణి టి.కృష్ణకుమారికి అందజేశారు. గ్రంథాలయానికి వచ్చే ప్రజలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని దాతను గ్రంథాలయ అధికారి ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మండవ కోటేశ్వరరావు, రవి కిరణ్, వెంకట్రావు, పిచ్చేశ్వరరావు, వీరభద్రరావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కూటమి ధ్యేయం

● జిల్లా పంచాయతీ రాజ్ అధికారిణి జె.అరుణ

గుడివాడ రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను స్వర్ణ పంచాయతీలుగా మార్చటానికి కార్యదర్శులు కృషి చేయాలని జిల్లా పంచాయతీ రాజ్ అధికారిణి జె.అరుణ తెలిపారు. మల్లాయిపాలెంలోని కల్యాణ మండపంలో పంచాయతీరాజ్ అధికారిణి ఆధ్వర్యంలో బుధవారం గుడివాడ డివిజన్ 14 మండలాల ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌డీలు, కార్యదర్శులకు వివిధ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్ విధానం ఖచ్చితంగా పాటించాలన్నారు. పంచాయతీల్లో ఇంటి పన్ను, నీటి తీరువా పనులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వాటర్ సరఫరాలో బ్లీచింగ్ సమపాళ్లలో కలపి చివరి కాలనీల వరకు అందించాలని కోరారు. ప్రతి పంచాయతీలో ప్రతి నెల ఆదాయ వివరాలు, ఖర్చుల వివరాలు పంచాయతీ సిబ్బంది ఏయే పనులు నిర్వహించారో తదితర విషయాలు రికార్డుల రూపంలో ఉండాలన్నారు. పంచాయతీలలో ప్రభుత్వం అమలుచేసే అభివృద్ధి కార్యక్రమాల వివరాలు ఉండాలన్నారు. పించన్ల పంపిణీ కార్యక్రమాన్ని పారదర్శకంగా, జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. డీఎల్‌పీవో సంపత్ కుమారి, ఎంపీడీవోలు, ఈవోపీఈఆర్‌డీలు, 14 మండలాల కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారిణి అరుణ

తూకాల్లో తేడా వస్తే చర్యలు తప్పవు

గుడివాడ, మే 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వ్యాపారి తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ కాటాలను మాత్రమే వినియోగించాలని, తూకాల్లో తేడా వస్తే కఠిన చర్యలు తప్పవని లీగల్ మెట్రాలజీ జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ టి.రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. ప్రపంచ తూనికల, కొలతల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక జైన్ మందిరంలో గుడివాడ బులియన్ అండ్ పాన్‌బ్రోకర్స్ వ్యాపారులకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బంగారానికి 1 మిల్లీ గ్రాము, వెండికి 10మిల్లీ గ్రాములు బరువు తేడా మించకుండా కాటాలను చూసుకోవాలన్నారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఎన్.ఈశ్వరరావు, అసోసియేషన్ అధ్యక్షుడు షా కీర్తి కుమార్ జీవావత్, సభ్యులు నాగమల్లేశ్వరరావు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు

85 ఏళ్లు దాటిన వారి వివరాల నమోదు

● తహసీల్దార్ రామకోటేశ్వరరావు

గుడివాడ రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో 85 ఏళ్లు దాటిన వ్యక్తుల వివరాల నమోదు కార్యక్రమం బీఎల్‌వోల స్థాయిల్లో ఉండాలని తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నియమ నిబంధనలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 85 ఏళ్లు దాటిన వ్యక్తులు చనిపోతే వెంటనే పంచనామా నిర్వహించి డెత్ సర్టిఫికెట్ జారీ చేసి, ఓటర్ల లిస్టుల్లో నుంచి తొలగించాలన్నారు. ఎవరైనా పర్మినెంట్‌గా వారి కుమారులు, కుమార్తెల దగ్గరకు వేరే ప్రాంతాలకు వెళ్లే వారి ఆధార్ కార్డుతో సహా ఓటరు కార్డును తొలగించాలన్నారు. ప్రతీ గ్రామంలో బీఎల్‌వోలు జాగ్రత్తగా పని చేయాలన్నారు. గ్రామాల్లో మార్పులు, చేర్పులు ఎవరైనా ఉన్నా వెంటనే బీఎల్‌వోలు స్పందించి వివరాలు వెంటనే రాయాలన్నారు. నూతనంగా ఎవరైనా మీ పరిధుల్లో వస్తే వారి వివరాలు నమోదు చేసి సంబంధిత పంచాయతీ కార్యాలయానికి తెలియజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ పెద్దిబోయిన రాజ్యలక్ష్మి, ఆర్ఐ నాగబాబు, బీఎల్‌వోలు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకోటేశ్వరరావు

ఘనంగా మంత్రి పయ్యావుల జన్మదినోత్సవం

గుడివాడ, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు, యలవర్తి సేనల ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్థిక, శాసనసభా వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ జన్మదిన వేడుకలను బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక స్టేడియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తిలు కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 100మంది పేదమహిళలకు చీరలు పంపిణీ చేశారు. స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. ప్రాంతీయ ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. బైపాస్ రోడ్డులోని మమత వృద్ధాశ్రమంలో వృద్ధులకు యలవర్తి కుటుంబసభ్యులు చీరలు పంపిణీ చేసి, మధ్యాహ్న భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలోని వృద్ధులను యలవర్తి కుటుంబసభ్యులు యలవర్తి కనకదుర్గ, సరళలు సత్కరించారు. స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి రంగప్రసాద్, బీజేపీ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, మాసీ కౌన్సిలర్లు వసంతవాడ దుర్గారావు, శొంఠి రామకృష్ణ, నాయకులు సత్యనారాయణ, చంటి, రమేష్, సుధారాణి, నాగరాజు, షేక్ ఇబ్రహీం, పద్మజ, రమ్య, అప్పారావు, పాండు, శ్రీలక్ష్మి, పాల్గొన్నారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న రావి, యలవర్తి

సృజనాత్మకతకు గ్రంథాలయాలు దోహదం

పామర్రు, మే 14(ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచే విద్యార్థులు సృజనాత్మక శక్తి పెంపొందింపచేసే అంశాలపై ఎక్కువ ఆసక్తి కలిగి ఉండాలని పామర్రు గ్రంథాలయాధికారి ఎం.రూన్సీరాణి అన్నారు. గ్రంథాలయాల్లో చిన్నారులకు కొనసాగుతున్న వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా బుధవారం కంప్యూటర్ విద్యతోపాటుగా,సాంస్కృతిక నృత్యాలు నేర్పించారు.

గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

గుడ్లవల్లేరు :గ్రామీణ వైద్యుల సమస్యలను,హక్కులను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని కోరుతూ రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్రకు రాష్ట్ర ఫెడరేషన్ ప్రాథమిక వైద్యసంఘాల సమాఖ్య, బేసిక్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. బీహెచ్‌ఎంపీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నండూరి ఉమాశంకర్, ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షులు సాగిరాజు ఉదయభాస్కరరాజు, పాల్గొన్నారు.

పామర్రు : గ్రామీణ వైద్యుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాకు బుధవారం పామర్రు కార్యాలయంలో గ్రామీణ వైద్యులు వినతిపత్రం అందించారు.

పాడిపరిశ్రమ అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

పమిడిముక్కల : రాష్ట్రంలో పశుసంపద పెంచడం ద్వారా పాడిపరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత నిచ్చి పశుపోషకులకు 50 శాతం రాయితీపై దాణా అందజేసి ప్రోత్సహిస్తుందని టీడీపీ నాయకుడు కొల్లిపర శివశంకర్(బాబి) పేర్కొన్నారు. కపిలేశ్వరపురం పశువైద్యశాలలో ప్రభుత్వం రాయితీపై తెల్లరేషన్ కార్డులు కలిగిన పశుపోషకులకు సమీకృత పశువుల దాణాను బుధవారం అందచేశారు. 50కిలోల దాణా సంచి ధర రూ. 1110 కాగా, ఒక్కో బస్తాకు ప్రభుత్వం రూ. 550 రాయితీ ఇచ్చి రూ.555లకే అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లిపర వెంకటేశ్వరరావు, జగదీశ్, పశువైద్యాధికారి ఎం.వెంకటేశ్, ఓఎస్ కె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పెదపారుపూడి : రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ చప్పిడి సమీరా అన్నారు. బుధవారం పెదపారుపూడి పశువైద్యశాల ఆవరణలో రైతులకు సబ్సిడీపై పశుదాణా పంపిణీ చేశారు. అనంతరం ఏడీ నరసింహారావు మాట్లాడుతూ రైతులకు 50 శాతం సబ్సిడీపై సమీకృత దాణాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ అందరూ అర్హులేనన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగిన రైతులు భారత్ పశుధన్ యాప్‌లో రైతు పేరు రిజిస్టరై ఉండాలన్నారు. 50 కిలోల దాణా సంచి పూర్తి ధర రూ.1,110 ప్రభుత్వం సబ్సిడీ రూ.555 మినహాయిస్తే కేవలం రూ.555లకు మాత్రమే అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా మిల్క్ యూనియన్ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ పునుకొల్లు రత్న ప్రసాద్ (నాని), పశువైద్యులు డాక్టర్ జయంత్, నాయకులు నాగనబోయిన గాంధీ, చప్పిడి కిషోర్, నాగదేశి జయరాజు, దగాని లెనిన్, మేడేపల్లి రవి, కనుమూరి సుబ్బారావు, అంగిరేకుల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



పశువుల దాణా అందజేస్తున్న టీడీపీ నాయకులు

నేత్రదానం

నందివాడ, మే 14 (ఆంధ్రజ్యోతి) : నందివాడకు చెందిన అడుసుమిల్లి ప్రసాద్ సతీమణి విజయలక్ష్మీ మృతి చెందగా, ఆమె నేత్రాలను మానవతా స్వచ్ఛంద సంస్థ గుడివాడ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఎల్.వి ప్రసాద్ నేత్ర వైద్యశాల వైద్యులు సేకరించారు. అదే విధంగా ఆమె పార్థీవ దేహాన్ని చినఅవుటపల్లిలోని డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలకు పరిశోధనల నిమిత్తం అందజేశారు. మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ వేణుగోపాలరావు, కోశాధికారి చంద్రశేఖరరావు, కార్యదర్శి పద్మజ పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ బ్రహ్మోత్సవాలు

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులో వేంచేసియున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు పవళింపు సేవతో బుధవారం ముగిశాయి. గత ఐదురోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు స్వామివారి పవళింపు సేవ కార్యక్రమంతో ముగింపు పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వల్లభనేని సీతారామ్ దంపతులు, వల్లభనేని లక్ష్మణరావు,పోలవరపు సీతారామయ్య, వెంకటేశ్వరరావు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, అగ్నిహోత్రం ఫణిగోపాలాచార్యులు భక్తులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'ఎప్పుడు అమల్జేస్తారు : సీపీఐ

కూచిపూడి : ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పూర్తిస్థాయిలో హామీలు అమలు కావటం లేదని సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడు అమలు చేస్తారని సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూచిపూడిలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఆ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీ శతజయంతి ఉత్సవాల సంవత్సరంలోనే పార్టీ మహాసభలు జరుపుకోవటం జరుగుతుందన్నారు. పార్టీ నేతలు వెంకటేశ్వరరావు, ప్రసాద్ బాబు, చెరుకు శ్రీనివాసరావు, కెవి.అప్పారావు, నాగేశ్వరరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

గుడివాడ, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగు సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు చింతలూరి సత్యనారాయణ, సీఐటీయూ నాయకులు ఆర్‌సీపీ రెడ్డి, పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణకు నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు సురేష్, కొండ, రజిని తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో పంచాయతీ కార్మికులు పాల్గొనాలని కోరుతూ సమ్మె నోటీసును మల్లాయిపాలెం పంచాయితీ కార్యదర్శి భట్రాజు కోటయ్యకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రేపాని కొండ, పంచాయతీ కార్మికులు తిరుమలరావు, దుర్గారావు, కుమారి, ఆనందరావు తదతరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని శ్రామిక హక్కుల పోరాట సంఘం రాష్ట్ర నాయకులు ఆర్.రఘు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఆటోనగర్‌లో ది గుడివాడ ఇండస్ట్రీయల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు టి.లక్ష్మణరావు, అధ్యక్షకార్యదర్శులు అబ్దుల్ హమీద్, అబ్దుల్ ఖుద్దూస్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నేత ఆర్‌సీపీ రెడ్డి